



# పెన్ పవర్

తెలుగు దిన పత్రిక

ప్రశ్నించడం మన హక్కు






సంపుటి : 1 సంచిక : 268 పేజీలు : 8 సంపాదకులు : జి.ఎ.రావు ( ఆనంద్ గంట్యాడ) ప్రచురణ : తాడేపల్లిగూడెం మంగళవారం 4 ఆగస్టు 2026 వెల : 1/-రూ ॥

VOLUME :1 ISSUE : 268 PAGES : 8 EDITOR : G. A. RAO ( ANAND GANTYADA ) PUBLISHED : THADEPALLI GUDEM TUE 4 AUGUST 2026 PRICE : 1/- RS

Simultaneously Published form : Thadepalligudem, Dr. B.R. Ambedkar Konasema Dist, Narasarao Peta,Bapatla,Visakhapatnam,Kakinada,Ongole, Kadapa,,SPSR Nellore, Circulated by :Srikakulam,manyam,Vizianagaram,East Godavari, Eluru,Guntur, Tirupati,Chittor,Kurnool,Anantapur

## నిమ్స్‌లో 1000 రోబోటిక్ సర్జరీలు.. దేశంలోనే కొత్త రికార్డ్!

- మూడేళ్ల లోపే ఈ మైలురాయిని అందుకున్న ఆసుపత్రి
- ప్రభుత్వ ఆసుపత్రుల్లో దేశంలోనే ఇదొక కొత్త బెంచ్‌మార్క్
- 90 శాతం సర్జరీలు ఆరోగ్యశ్రీ, సీఎంఆర్ఎఫ్ కింద ఉచితంగా నిర్వహణ
- నిమ్స్ బృందాన్ని అభినందించిన సీఎం రేవంత్ రెడ్డి, ఆరోగ్య మంత్రి దామోదర



**పెన్ పవర్ డెస్క్:** హైదరాబాద్‌లోని నిజాం ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ (నిమ్స్) వైద్య రంగంలో అరుదైన మైలురాయిని అధిగమించింది. మూడేళ్ల కంటే తక్కువ వ్యవధిలోనే 1000 రోబోటిక్ శస్త్రచికిత్సలను విజయవంతంగా పూర్తి చేసినట్లు తెలంగాణ ప్రభుత్వం సోమవారం ప్రకటించింది. దేశంలోని ప్రభుత్వ ఆరోగ్య సంస్థల్లో ఇదొక నూతన రికార్డు అని, సామాన్యులకు సైతం అత్యాధునిక రోబోటిక్ వైద్య సేవలను అందుబాటులోకి తీసుకువచ్చామని ప్రభుత్వం పేర్కొంది. ఈ అద్భుత ఘనత సాధించిన నిమ్స్ డైరెక్టర్, యూరాలజీ అండ్ రీనల్ ట్రాన్స్‌ప్లాంటేషన్ విభాగం సీనియర్ ప్రొఫెసర్ డాక్టర్ రాహుల్ దేవరాజ్‌తో పాటు యూరాలజీ,

- మిగతా 2లో



"మిస్టర్ డ్రామారావు"

## అంటూ కేటీఆర్ పై మంత్రి పొంగులేటి ఫైర్

- పెద్ది సుదర్శన్ రెడ్డి మరణంతో బీఆర్ఎస్ రాజకీయం చేస్తోందని ఆరోపణ
- పదేళ్లలో మంత్రి పదవి ఇవ్వకుండా అవమానించారని విమర్శ
- అధికార లాంఛనాలతో గౌరవించింది కాంగ్రెస్ ప్రభుత్వమేనని వెల్లడి
- వచ్చే ఎన్నికల్లో బీఆర్ఎస్‌కు ప్రజలు గుణపాఠం చెబుతారని వ్యాఖ్య

**పెన్ పవర్ డెస్క్:** తెలంగాణ మంత్రి, కాంగ్రెస్ సీనియర్ నేత పొంగులేటి శ్రీనివాసరెడ్డి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెం ట్ కేటీఆర్‌పై తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. దివంగత ఉద్యమ నేత

- మిగతా 2లో

## మహిళా రెజ్లర్లపై లైంగిక వేధింపుల కేసులో తీర్పు.. నిర్దోషిగా బ్రిజ్ భూషణ్



- మహిళా రెజ్లర్ల లైంగిక వేధింపుల కేసులో బ్రిజ్ భూషణ్‌కు ఊరట
- ఆయన్ను నిర్దోషిగా ప్రకటించిన ఢిల్లీ రౌస్ అవెన్యూ కోర్టు
- సహ నిందితుడు వినోద్ తోమర్‌కు కూడా క్లీన్ చిట్
- గౌరవప్రదంగా నిర్దోషిగా తేల్చిందన్న బ్రిజ్ భూషణ్

- మిగతా 2లో

## కర్ణాటక కేబినెట్ విస్తరణ: చివరి నిమిషంలో మార్పులతో కాంగ్రెస్‌లో అసమ్మతి జ్వాలలు

- కర్ణాటక కేబినెట్ విస్తరణతో కాంగ్రెస్‌లో తీవ్ర అసమ్మతి
- చివరి నిమిషంలో జాబితా నుంచి మంకాల్ వైద్య పేరు తొలగింపు
- సీనియర్ లింగాయత్ నేత ఎస్.ఎస్. మల్లికార్జున్‌కు చోటు
- పదవులు దక్కని ఎమ్మెల్యేలు రాజీనామా చేస్తామని హెచ్చరిక
- ఎమ్మెల్యే తన్వీర్ సేఠ్ మద్దతుదారుడి ఆత్మహత్యాయత్నం

- మిగతా 2లో



## బీజేపీకి భారీ షాక్.. బంకీపూర్ కోట బద్దలు కొట్టిన ప్రశాంత్ కిశోర్

- 19,324 ఓట్ల ఆధిక్యంతో బీజేపీ అభ్యర్థిపై గెలుపు
- మూడు దశాబ్దాలుగా బీజేపీకి కంచుకోటగా ఉన్న స్థానం కైవసం
- ఎన్నికల బరిలో తొలి విజయాన్ని అందుకున్న జన సురాజ్ పార్టీ

**పెన్ పవర్ డెస్క్:** ప్రముఖ రాజకీయ వ్యూహకర్త, జన్ సురాజ్ పార్టీ అధినేత ప్రశాంత్ కిశోర్ (పీకే) ప్రత్యక్ష రాజకీయాల్లో సంచలన విజయాన్ని నమోదు చేశారు. బీహార్‌లోని బంకీపూర్ అసెంబ్లీ నియోజకవర్గానికి జరిగిన

- మిగతా 2లో





## టీటీడీ ఆసుపత్రుల్లో మందుల కొనుగోళ్లలో భారీ అవినీతి

లోకేశ్‌పై భూమన కరుణాకర్ రెడ్డి తీవ్ర ఆరోపణలు

- ఏపీలో అవినీతి తీవ్ర స్థాయికి చేరిందన్న భూమన
- టీటీడీని కూడా వదలకుండా పీడిస్తున్నారని ఆరోపణ
- ఎల్1 టెండర్ల పేరుతో అక్రమాలకు తెరలేపారన్న భూమన

**పెన్ పవర్ డెస్క్:** ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో అవినీతి తీవ్ర స్థాయికి చేరుకుందని వైసీపీ నేత, టీటీడీ మాజీ చైర్మన్ భూమన కరుణాకర్ రెడ్డి మండిపడ్డారు. ఈ అవినీతిలో మంత్రి నారా లోకేశ్ పాత్ర స్పష్టంగా ఉందని ఆరోపించారు. తిరుపతిలోని ప్రసిద్ధ స్విమ్స్, బర్డ్స్ ఆసుపత్రుల్లో ప్రాణరక్షక మందులు, వైద్య పరికరాల కొనుగోళ్లలో పెద్ద ఎత్తున అక్రమాలు జరుగుతున్నాయని విమర్శించారు. పవిత్రమైన ధార్మిక సంస్థ అయిన టీటీడీని కూడా వదిలిపెట్టకుండా ఇష్టమొచ్చినట్లు పట్టి పీడిస్తున్నారని ధ్వజమెత్తారు. శస్త్ర చికిత్సలకు అవసరమైన పరికరాల నుంచి పెద్ద పెద్ద యంత్రాల టెండర్ల వరకు తీవ్రస్థాయిలో గోల్‌మాల్ జరుగుతోందని విమర్శించారు. ఎల్1 టెండర్ల పేరుతో అక్రమాలకు తెరలేపారని, కంపెనీలతో ముందే లోపాయికారీ ఒప్పందాలు కుదుర్చుకుని, తక్కువ ధరకు లభించే పరికరాలను టీటీడీకి ఎక్కువ ధరకు అమ్ముతూ సొమ్ము

- మిగతా 2లో

## రవాణా శాఖలో అనవసర నిబంధనలు తొలగించండి

- తాగునీటి ఎద్దడి తలెత్తకుండా చూడాలని సీఎం చంద్రబాబు అధికారులను ఆదేశించారు
- ఎల్ నినో ప్రభావంతో రాష్ట్రంలో నెలకొన్న వర్షాభావ పరిస్థితులపై సమీక్ష
- రవాణా శాఖలో అనవసర నిబంధనలు తొలగించి, సేవలు సులభతరం చేయాలని సూచన
- పశుగ్రాసం కొరత రాకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని ఆదేశం
- వివిధ శాఖల పనితీరుపై ఆర్టీజీఎస్‌లో ముఖ్యమంత్రి కీలక ఆదేశాలు జారీ



**పెన్ పవర్ డెస్క్:** రవాణా శాఖలో అనవసర నిబంధనలను తక్షణమే తొలగించాలని, టెక్నాలజీని పూర్తిస్థాయిలో ఉపయోగించి ప్రజలకు సులభతరమైన, అవినీతి రహిత సేవలు అందించాలని ముఖ్యమంత్రి చంద్రబాబు అధికారులను ఆదేశించారు. సచివాలయంలోని ఆర్టీజీఎస్ సెంటర్‌లో సోమవారం వివిధ శాఖల పనితీరుపై ఆయన సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా రవాణా శాఖలో చేపట్టాల్సిన సంస్కరణలపై సీఎం కీలక సూచనలు చేశారు. రవాణా శాఖలో సంస్కరణలకు తీసుకుంటున్న చర్యలను అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు. 24 గంటల్లో డీమ్డ్ రిజిస్ట్రేషన్ విధానం, ఆటోమేటెడ్ డ్రైవింగ్ టెస్టింగ్ ట్రాక్స్ ఏర్పాటు, ఫారం-5బీ వంటి పరీక్షల తొలగింపు ద్వారా అవినీతికి ఆస్కారం లేకుండా చూడవచ్చని తెలిపారు. ఈ చర్యలతో ప్రజలకు వేగవంతమైన, పారదర్శక సేవలు అందుబాటులోకి వస్తాయని పేర్కొన్నారు. దశలవారీగా ఈ సంస్కరణలను అమలు చేసేందుకు తాము ప్రణాళిక సిద్ధం చేశామని అధికారులు చెప్పగా, వీలైనంత త్వరగా అనవసర నిబంధనలను తొలగించి, ప్రజలకు ఇబ్బందులు లేని వ్యవస్థను రూపొందించాలని సీఎం చంద్రబాబు స్పష్టం చేశారు. ఈ సమీక్షలో రాష్ట్రంలో నెలకొన్న వర్షాభావ పరిస్థితులపై కూడా సీఎం సుదీర్ఘంగా చర్చించారు. ఎల్ నినో ప్రభావంతో తాగునీటి ఎద్దడి తలెత్తే ప్రమాదం ఉందని, ఈ సమస్యపై అధికారులు ప్రత్యేక

- మిగతా 2లో



## డీల్ కుదుర్చుకోండి.. లేదా లొంగిపోండి

**పెన్ పవర్ డెస్క్:** ఇరాన్ తమతో ఒప్పందం కుదుర్చు కోవాలని లేదా పూర్తిగా లొంగిపోవాలని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ హెచ్చరించారు. ఇరాన్ ద్వంద్వ వైఖరిని అవలింబిస్తోందన్నారు. " ఆ దేశ నాయకులు మాతో చర్చలు కావాలని కోరుతున్నారు. కానీ బహిరంగంగా నిరాకరి స్తున్నట్లు చెబుతున్నారు. మరోవైపు హర్మూజ్‌ను తామే నిర్వహిస్తున్నామని చెబుతున్నారు. ఆ జలసంధి పూర్తిగా అమెరికా నియంత్రణలో ఉంది. మేము కోరుకుంటే

- మిగతా 2లో



## 'గ్రేట్ గ్రీన్ వాల్ ఆఫ్ ఏపీ' పనుల్లో వేగం పెంచండి

**పెన్ పవర్ డెస్క్:** తీర ప్రాంత పర్యావరణ పరిరక్షణ, కోతల నివారణ చర్యల్లో భాగంగా చేపట్టిన ప్రాజెక్టు గ్రేట్ గ్రీన్ వాల్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ పనుల్లో వేగం మరింత పెరగాలని డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ ఆదేశించారు. ఈ ఏడాది నిర్దేశిత లక్ష్యాలను వచ్చే రెండు నెలల్లో పూర్తిచేసేలా ప్రణాళికలు రూపొందించుకోవాలని స్పష్టం చేశారు. గ్రేట్ గ్రీన్ వాల్ పనుల పురోగతిపై అటవీశాఖ ఉన్నతాధికారులతో పవన్ సమీక్షించారు. డివిజన్లవారీగా నిర్దేశించిన లక్ష్యాలు ఎంత వరకు పూర్తి చేశారు? ఇప్పటి వరకు ఎన్ని మొక్కలు నాటారు?

- మిగతా 2లో

## కడప ఎయిర్‌పోర్ట్ లంచం కేసు: మాజీ అధికారికి మూడేళ్ల కఠిన కారాగారం

- కడప ఎయిర్‌పోర్ట్ లంచం కేసులో సీబీఐ విచారణ
- 9 ఏళ్ల క్రితం కాంట్రాక్టర్ నుంచి రూ. 50,000 లంచం డిమాండ్ చేసిన వైనం
- రూ. 25,000 తీసుకుంటుండగా రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్న సీబీఐ అధికారులు
- మాజీ ఏజీఎం శ్రీనివాసన్‌కు జైలు శిక్షతో పాటు రూ. 50,000 జరిమానా విధించిన కోర్టు

- మిగతా 2లో




## రాయలసీమ వనరులు తీవ్రంగా దోపిడీకి గురయ్యాయి

- రైజింగ్ రాయలసీమ కార్యక్రమంలో పాల్గొన్న మాధవ్
- ఈ ప్రాంతం నుంచి ఎంతో మంది సీఎంలు వచ్చారని వ్యాఖ్య
- రాయలసీమ అభివృద్ధికి ప్రత్యేక ప్రణాళికలు రచించాలని పిలుపు

**పెన్ పవర్ డెస్క్:** కర్నూలు రాయలసీమ విశ్వవిద్యాలయంలో సమర్థ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన 'రైజింగ్ రాయలసీమ' కార్యక్రమంలో

- మిగతా 2లో



## ఎడిటర్ వ్యూ

# సొంత వ్యూహాలతో జనసేన సిద్ధమేనా ?

రాజకీయాలు అంటే నిరంతరం పారే నది లాంటివి. ఆ నదిలో కూడా పైకి కనిపించే స్వచ్చత లోపల ఉండదు, పైగా గండాలు సుడి గుండాలు ఎన్నో ఉంటాయి. అలాంటి పాలిటిక్స్ అంటేనే టఫెస్ట్ జాబ్ అని అంటారు. ఇక్కడ ఎవరూ ఒకరిని కోరి ముద్దాడరు, అలాగే నెత్తికి ఎక్కించుకుని అందలాలు అందించరు, శోధించి సాధించిన వారికే పగ్గాలూ పట్టాభిషేకాలు దక్కుతాయి. జనసేన ఈ విషయంలో గట్టిగానే ఆత్మ పరిశీలన చేసుకోవాల్సిన అవసరం ఉందని అంటున్నారు. జనసేన అధినేత ఎప్పుడూ ఏ వేదిక మీద అయినా ఒక్కటే మాట అంటున్నారు, పొత్తులు కూటములు అంటూ ఆయన మాట్లాడుతున్నారు. పొత్తులు అన్నవి రాజకీయాల్లో వ్యూహం మాత్రమే. వ్యూహాలు కూడా పది వేస్తే అన్నీ హిట్ అవాల్సిన అవసరం లేదు, పైగా ఒకసారి హిట్ అయింది మళ్ళీ అవాలని అసలు లేదు అని రాజకీయ విశ్లేషకులు గుర్తు చేస్తున్నారు.

**మోడీ మీద ఆరాధన :**

ప్రధాని మోడీ మీద ఆరాధన జనసేన అధినేతకు ఉండొచ్చు తప్పు లేదు, ఆయన తనకంటూ ఒక కుటుంబం లేకుండా దేశం కోసం అంకితం అయి పనిచేస్తున్న వారు అని కూడా పవన్ కి ఉండొచ్చు. అయితే దానిని మరీ బాహాటంగా చెప్పాల్సిన అవసరం లేదని అంటున్నారు. పైగా బీజేపీ ఒక పార్టీ జనసేన ఒక పార్టీ అన్నది గుర్తెరగాలి అంటున్నారు. భోగాపురం ఎయిర్ పోర్టు ఓపెనింగ్ లో మోడీ మీద పవన్ ఆరాధనాభావం అయితే పీక్స్ కి వెళ్ళిందని అంటున్నారు. మోడీని అంటే కన్నీళ్ళు వచ్చాయని ఆయన చెబుతున్నారు. అయితే దానికి ముందూ వెనకా ఎన్నో జరిగాయని కూడా విశ్లేషించుకోవాలి కదా అంటున్నారు. విద్యార్థుల ఉద్యమం ఏకంగా పాతిక రోజులకు పైగా నడిచింది. వారి మీద పోలీసులు దాడి చేశారు. దానికి ప్రతిస్పందనగా అలా మోడీని టార్గెట్ చేయడం జరిగింది అని ఆ వైపు నుంచి వస్తోంది. ఇక జెన్ జీ యూత్ అయితే పవన్ వ్యాఖ్యల మీద సోషల్ మీడియా వేదికగా కామెంట్స్ చేస్తున్నారు.

**శాశ్వత ప్రధానిగా మోడీ :**

మోడీయే ఎల్లకాలం ప్రధాని అన్నది పవన్ భావన కావచ్చు, ధీమా కావచ్చు, కానీ రాజకీయాల్లో ఎపుడేమి జరుగుతుందో ఎవరికీ తెలియదు అంటారు. అందువల్ల 2029 లో మోడీ బీజేపీ పరిస్థితి ఏంటి అన్నది కూడా చూడాల్సి ఉంటుంది. మోడీ శాశ్వత ప్రధానిగా ఉంటే దేశానికి మేలు అన్నది పవన్ అభిప్రాయం కావచ్చు, కానీ రాజకీయాల్లో ప్రజాస్వామ్యంలో మార్పు సహజం. అందుకే పవన్ మాటలకు కాంగ్రెస్ వంటి పార్టీల నుంచి రియాక్షన్ వస్తోంది అని అంటున్నారు.

**జనసేనకు అండగా :**

జనసేనకు బీజేపీ అండగా ఉంది అన్నది నిజం. ముఖ్యంగా మోడీ పవన్ ని బాగా ఆదరించి అభిమానిస్తున్నారు. కానీ ఎల్ల కాలం ఈ రకమైన పరిస్థితి ఉండకపోవచ్చు అని అంటున్నారు. రేపటి రోజున దేశ రాజకీయ ముఖ చిత్రం మారినపుడు దానికి అనుగుణంగా ఏ పార్టీ అయినా తమ సొంత వ్యూహాలను అజెండాను యాక్షన్ ప్లాన్ ని తయారు చేసుకోవాల్సి ఉంటుందని అంటున్నారు. దాంతో పాటుగా జనసేనను సొంత లక్ష్యాలతో అధికారానికి దగ్గర చేయడానికి ప్రయత్నం చేయాలని కోరుతున్న హితైషులు కూడా ఉన్నారు. మొత్తానికి సందర్భం కాకపోయినా పవన్ తన అభిమానాన్ని మోడీ పట్ల చాటుకున్నారు. ఇపుడు మోడీ ప్రత్యర్థులకు అవి ఏ మాత్రం నచ్చడం లేదని అంటున్నారు. అందుకే రాజకీయాల్లో ఆచీ తూచీ మాట్లాడాలని కూడా సూచనలు వస్తున్నాయి.

# రవాణా శాఖలో అనవసర నిబంధనలు తొలగించండి

- మొదటి పేజి తరువాయి

దృష్టి సారించాలని ఆదేశించారు. రిజర్వాయర్లలో నీటి లభ్యతను ఎప్పటికప్పుడు గమనిస్తూ, తాగునీటి సరఫరాలో ఎలాంటి ఇబ్బందులు రాకుండా చూడాలన్నారు. ఎగువ రాష్ట్రాల్లో వర్షాలు కురుస్తున్నందున కృష్ణా బేసిన్‌లోకి నీటి లభ్యత పెరిగే అవకాశం ఉందని, కృష్ణా, గోదావరి నదుల నుంచి వచ్చే వరద జలాలను సద్వినియోగం చేసుకునేలా సమర్థవంతమైన నీటి నిర్వహణ చేపట్టాలని దిశానిర్దేశం చేశారు.

వర్షాభావం కారణంగా భవిష్యత్తులో పశుగ్రాసం కొరత ఏర్పడే అవకాశం ఉందని, దీనికి అవసరమైన ముందస్తు చర్యలు తీసుకోవాలని సీఎం ఆదేశించారు. మున్సిపాలిటీలు, గ్రామీణ ప్రాంతాల్లో తాగునీటి నాణ్యతను తరచూ పరీక్షించాలని, ల్యాబ్ నివేదికలను ప్రజలకు అందుబాటులో ఉంచాలని సూచించారు. అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి అంగన్‌వాడీ కేంద్రాలను తనిఖీ చేయాలని ఆదేశించారు. ఈ సమావేశంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సాయి ప్రసాద్, వివిధ శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# “మిస్టర్ డ్రామారావు” అంటూ కేటీఆర్ పై మంత్రి పొంగులేటి ఫైర్

- మొదటి పేజి తరువాయి

పెద్ది సుదర్శన్ రెడ్డి మరణాన్ని కేటీఆర్ రాజకీయ ప్రయోజనాల కోసం వాడుకుంటున్నారని ఆరోపిస్తూ సోమవారం ‘ఎక్స్’ వేదికగా ఘాటు విమర్శలు చేశారు. పెద్ది సుదర్శన్ రెడ్డి జీవించి ఉన్నప్పుడు ఆయన్ని విస్మరించి, ఇప్పుడు ఆయన మరణంపై రాజకీయం చేస్తున్న ‘మిస్టర్ డ్రామారావు’ కేటీఆర్ అంటూ పొంగులేటి మండిపడ్డారు.పదేళ్లు అధికారంలో ఉన్న బీఆర్ఎస్ ప్రభుత్వం, ఉద్యమకారుడైన పెద్ది సుదర్శన్ రెడ్డికి మంత్రి పదవి ఇవ్వకుండా అవమానించిందని పొంగులేటి ఆరోపించారు. ఎమ్మెల్యేగా ఓటమి పాలైన తర్వాత ఆయనకు కనీసం రాజ్యసభ లేదా ఎమ్మెల్సీ పదవి అయినా ఎందుకు ఇవ్వలేదని నిలదీశారు. సంతోష్ రావు, దామోదర్ రావు వంటి వారికి పదవులు కట్టబెట్టిన బీఆర్ఎస్ నాయకత్వం, పెద్ది సుదర్శన్ రెడ్డిని ఎందుకు విస్మరించిందని ఆయన ప్రశ్నించారు.

తమ కాంగ్రెస్ ప్రభుత్వం పెద్ది సుదర్శన్ రెడ్డిని వైద్య చికిత్స కోసం వరంగల్ నుంచి హైదరాబాద్‌కు తరలించేందుకు గ్రీన్ ఛానెల్ ఏర్పాటు చేసిందని, ఆయన అంత్యక్రియలను అధికారిక పోలీసు లాంఛనాలతో నిర్వహించి గౌరవించిందని పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి గుర్తుచేశారు. ఉద్యమకారులను కేవలం ఓట్ల కోసం వాడుకుని, అధికారం, కీలక పదవులన్నీ కల్వకుంట్ల కుటుంబమే

అనుభవించడం బీఆర్ఎస్‌కు అలవాటుగా మారిందని ఆయన ఆరోపించారు. మరణాలను సైతం రాజకీయ లబ్ధి కోసం వాడుకుంటున్న బీఆర్ఎస్ పార్టీకి రాబోయే రోజుల్లో తెలంగాణ ప్రజలు మరోసారి గుణపాఠం చెప్పడం ఖాయమని పొంగులేటి ధ్వజమెత్తారు.

# టీటీడీ ఆసుపత్రుల్లో మందుల కొనుగోళ్లలో భారీ అవినీతి

- మొదటి పేజి తరువాయి

చేసుకుంటున్నారని ఆరోపించారు.మంత్రి నారా లోకేశ్ అమలు చేస్తున్న ‘రెడ్ బుక్’ రాజ్యాంగం వల్లే రాష్ట్రంలో హింస, అవినీతి కరాళ నృత్యం చేస్తున్నాయని భూమన విమర్శించారు. ప్రాణరక్షక మందుల కొనుగోళ్ల వెనుక ఉన్న ఈ దిగజారుడు కుట్రపై తక్షణమే సమగ్ర విచారణ జరిపించాలని ఆయన డిమాండ్ చేశారు.

# ‘గ్రేట్ గ్రీన్ వాల్ ఆఫ్ ఏపీ’ పనుల్లో వేగం పెంచండి

- మొదటి పేజి తరువాయి

ఈ ఏడాది మడ అడవులు ఎంత విస్తీర్ణంలో నాటనున్నారు? తదితర వివరాలను అంశాల వారీగా అధికారులను అడిగి తెలుసుకున్నారు. గ్రేట్ గ్రీన్ వాల్ లక్ష్యసాధనలో భాగంగా గత రెండేళ్లలో సాధించిన పురోగతికి జాతీయ స్థాయి గుర్తింపు లభించిన అంశాన్ని పవన్ గుర్తు చేశారు. మడ అడవుల విస్తరణలో దేశంలో రెండో స్థానం సాధించేందుకు కృషి చేసిన అధికారులకు అభినందనలు తెలిపారు.

# కర్ణాటక కేబినెట్ విస్తరణ: చివరి నిమిషంలో మార్పులతో కాంగ్రెస్‌లో అసమ్మతి జ్వాలలు

కర్ణాటకలో కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టిన మంత్రివర్గ విస్తరణ ఆ పార్టీలో తీవ్ర అసంతృప్తిని, అంతర్గత విభేదాలను రాజేసింది. మంత్రి పదవుల ఖరారులో కాంగ్రెస్ అధిష్ఠానం చివరి నిమిషంలో మార్పులు చేయడంతో, పదవులు ఆశించి భంగపడిన పలువురు ఎమ్మెల్యేలు బహిరంగంగానే తమ నిరసన వ్యక్తం చేస్తున్నారు. కొందరు రాజీనామాకు సిద్ధమవగా, మరికొందరి మద్దతుదారులు ఆందోళనలకు దిగారు.

సోమవారం నాడు మొత్తం 20 మంది శాసనసభ్యులతో మంత్రివర్గాన్ని విస్తరించాలని కాంగ్రెస్ పార్టీ నిర్ణయించింది. అయితే, తుది జాబితా నుంచి మంకాల్ ఎస్. వైద్య పేరును తొలగించి, ఆయన స్థానంలో సీనియర్ లింగాయత్ నేత, మాజీ మంత్రి ఎస్.ఎస్. మల్లికార్జున్‌ను చేర్చడం వివాదానికి దారితీసింది. ప్రాంతీయ, సామాజిక సమీకరణాలను సమతుల్యం చేసేందుకే ఈ మార్పు చేసినట్లు రాజకీయ వర్గాలు భావిస్తున్నాయి.మంత్రి పదవి దక్కకపోవడంపై ఇండి నియోజకవర్గ ఎమ్మెల్యే యశ్వంత్ రాయగౌడ పాటిల్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. చివరి నిమిషం వరకు హామీ ఇచ్చి మోసం చేశారని, ఇది తనపై జరిగిన పెద్ద కుట్ర అని ఆయన ఆరోపించారు. స్పీకర్‌కు సమర్పించేందుకు తన రాజీనామా లేఖను కూడా సిద్ధం చేసుకున్నట్లు వెల్లడించారు. మరో ఎమ్మెల్యే, మాజీ మంత్రి బేలూరు గోపాలకృష్ణ సైతం తన శాసనసభ సభ్యత్వానికి రాజీనామా చేస్తానని ప్రకటించారు. పార్టీకి విధేయులుగా ఉన్న వారిని విస్మరించి, రాజకీయ పలుకుబడి ఉన్న కుటుంబాలకే ప్రాధాన్యం ఇచ్చారని ఆయన విమర్శించారు.వీరితో పాటు సీనియర్ నేతలు హంపనగౌడ బదర్లి, అశోక్ పట్టణ్, రాఘవేంద్ర హిట్నాల్ వంటి వారు కూడా తీవ్ర నిరాశ వ్యక్తం చేశారు. మరోవైపు, ఆరుసార్లు ఎమ్మెల్యేగా గెలిచిన తన్వీర్ సేఠ్‌కు మంత్రి పదవి ఇవ్వలేదన్న మనస్తాపంతో ఆయన అనుచరుడు ఒకరు విషం తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడటం అక్కడ నెలకొన్న ఉద్రిక్త పరిస్థితులకు అద్దం పడుతోంది. ఈ పరిణామాల మధ్యే నేడు సాయంత్రం లోక్ భవన్ ప్రాంగణంలో కొత్త మంత్రుల ప్రమాణ స్వీకారం కార్యక్రమం జరిగింది.

# డీల్ కుదుర్చుకోండి.. లేదా లొంగిపోండి

- మొదటి పేజి తరువాయి

తప్ప ఇరాన్‌కు ఏదీ చేరదు. ఆ దేశం వద్ద ఎప్పటికీ అణ్వాయుధం ఉండదు” అని ట్రూత్ సోషల్‌లో పోస్టు చేశారు. ఆయన మీడియాతో మాట్లాడుతూ.. దాడులు ఆపాలని తమ బలగాలను ఆదేశించానని చెప్పిన సంగతి తెలిసిందే. రెండో ప్రపంచ యుద్ధం తర్వాత జరగబోయే అతిపెద్ద దాడికి అనుగుణంగా ప్రణాళికలు సిద్ధం చేశానన్న ట్రంప్.. గల్ఫ్‌లోని మిత్రదేశాలైన ఖతార్, సౌదీ అరేబియా, యూఏఈ విజ్ఞప్తి మేరకు తన నిర్ణయాన్ని వాయిదా వేసుకున్నట్లు చెప్పారు. ఆయా దేశాల ఉన్నతాధికారులతో మాట్లాడిన తర్వాత ఇరాన్‌తో దౌత్యానికి మరింత అవకాశం ఇవ్వాలని నిర్ణయించుకున్నట్లు తెలిపారు.ఒప్పందం ఖరారు కాకపోతే మళ్లీ దాడులకు దిగుతామని హెచ్చరించారు. కాగా, ఇరాన్ విదేశాంగశాఖ ప్రతినిధి ఇస్మాయిల్ బఘాయీ.. ట్రంప్ వ్యాఖ్యలను కొట్టిపారేశారు. వాషింగ్టన్‌తో చర్చలు జరపడం లేదని చెప్పారు. ప్రస్తుతం జరుగుతున్న ఏకైక చర్చలు జలసంధికి అవతలి వైపున ఉన్న ఒమన్‌తో మాత్రమేనని చెప్పారు. అది కూడా హర్మూజ్ గుండా తాత్కాలిక సురక్షిత నౌకాయాన మార్గాన్ని ఏర్పాటు చేయడం వరకేనని స్పష్టం చేశారు. ఈ నేపథ్యంలో ట్రంప్ హెచ్చరికలు ప్రాధాన్యత సంతరించుకున్నాయి.

# నిమ్స్‌లో 1000 రోబోటిక్ సర్జరీలు.. దేశంలోనే కొత్త రికార్డ్!

- మొదటి పేజి తరువాయి

సర్జికల్ గ్యాస్ట్రోఎంటరాలజీ, సర్జికల్ ఆంకాలజీ, అనస్థీషియాలజీ, నర్సింగ్, ఆపరేషన్ థియేటర్ సిబ్బందిని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి (నిమ్స్ పాలకమండలి అధ్యక్షుడు) ప్రత్యేకంగా అభినందించారు.మొత్తం 1000 శస్త్రచికిత్సలలో యూరాలజీ విభాగం 590, సర్జికల్ గ్యాస్ట్రోఎంటరాలజీ 248, సర్జికల్ ఆంకాలజీ 162 సర్జరీలు నిర్వహించాయి. వీటిలో 90 శాతానికి పైగా ఆపరేషన్లను ఆరోగ్యశ్రీ, ముఖ్యమంత్రి సహాయ నిధి (సీఎంఆర్ఎఫ్) పథకాల ద్వారా ఉచితంగా అందించడం గమనార్హం. రాడికల్ ప్రోస్టేటెక్టమీ, రాడికల్ సిస్టెక్టమీ, క్లిష్టమైన రోబోటిక్ రీనల్ ట్రాన్స్‌ప్లాంటేషన్ వంటి అత్యంత సంక్లిష్టమైన శస్త్రచికిత్సలను వైద్య బృందం విజయవంతంగా పూర్తి చేసింది. రోబోటిక్ శస్త్రచికిత్సల వల్ల కచ్చితత్వం మెరుగుపడుతుందని, శస్త్రచికిత్స అనంతరం

నొప్పి, రక్తస్రావం తగ్గడంతో పాటు రోగులు వేగంగా కోలుకుని డిశ్చార్జ్ అయ్యే అవకాశం ఉంటుందని వైద్యులు తెలిపారు. సామాన్య పౌరులకు అత్యుత్తమ వైద్య సేవలను చేరువ చేయడమే తమ ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ పేర్కొంటూ నిమ్స్ బృందాన్ని ప్రశంసించారు.

# బీజేపీకి భారీ షాక్.. బంకీపూర్ కోట బద్దలు కొట్టిన ప్రశాంత్ కిశోర్

- మొదటి పేజి తరువాయి

ఉప ఎన్నికలో ఆయన ఘన విజయం సాధించారు. దాదాపు మూడు దశాబ్దాలుగా బీజేపీకి కంచుకోటగా ఉన్న ఈ స్థానంలో, ఆ పార్టీ అభ్యర్థి నీరజ్ కుమార్ సిన్హాపై సుమారు 19,324 ఓట్ల ఆధిక్యంతో విజయం సాధించి అందరినీ ఆశ్చర్యపరిచారు.సోమవారం జరిగిన ఓట్ల లెక్కింపులో మొత్తం 32 రౌండ్ల ముగిసేసరికి ప్రశాంత్ కిశోర్‌కు 64,151 ఓట్లు రాగా, బీజేపీ అభ్యర్థి నీరజ్ కుమార్‌కు 44,827 ఓట్లు పోలయ్యాయి. ఇక ఆర్జేడీ అభ్యర్థి రేఖా కుమారి 14,273 ఓట్లతో మూడో స్థానానికే పరిమితమయ్యారు. ఈ విజయంతో ప్రశాంత్ కిశోర్ తొలిసారిగా అసెంబ్లీలో అడుగుపెట్టనున్నారు. ఆయన స్థాపించిన జన సురాజ్ పార్టీకి సైతం ఇదే తొలి ఎన్నికల విజయం కావడం విశేషం.బీజేపీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబిన్ రాజ్యసభకు ఎన్నిక కావడంతో బంకీపూర్ స్థానానికి ఉప ఎన్నిక అనివార్యమైంది. 1995 నుంచి (గతంలో పట్నా పశ్చిమ స్థానంగా పిలిచేవారు) ఈ నియోజకవర్గం బీజేపీకి తిరుగులేని కోటగా ఉంది. గతేడాది జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో జన సురాజ్ పార్టీ అనేక స్థానాల్లో పోటీ చేసినప్పటికీ ఒక్క చోట కూడా విజయం సాధించలేకపోయింది. ఈ నేపథ్యంలో పీకే సాధించిన విజయం ఆ పార్టీ శ్రేణుల్లో కొత్త ఉత్సాహాన్ని నింపింది.ఈ ఫలితంపై బీహార్ ముఖ్యమంత్రి సామ్రాట్ చౌదరి, మంత్రి విజయ్ కుమార్ సిన్హా స్పందిస్తూ, ప్రజా తీర్పును గౌరవిస్తున్నామని పేర్కొన్నారు. ఈ సందర్భంగా వారు ప్రశాంత్ కిశోర్‌కు అభినందనలు తెలియజేశారు. ఈ ఉప ఎన్నికలో కేవలం 34.30 శాతం మాత్రమే పోలింగ్ నమోదు కావడం గమనార్హం. పాట్నా లాంటి పట్టణ ప్రాంతంలో, బీజేపీకి అత్యంత పట్టున్న స్థానంలో ప్రశాంత్ కిశోర్ విజయం సాధించడం ఇప్పుడు జాతీయ రాజకీయాల్లో చర్చనీయాంశంగా మారింది.

# కడప ఎయిర్‌పోర్ట్ లంచం కేసు: మాజీ అధికారికి మూడేళ్ల కఠిన కారాగారం

కడప ఎయిర్‌పోర్ట్‌లో తొమ్మిదేళ్ల క్రితం నమోదైన లంచం కేసులో కర్నూలులోని సీబీఐ ప్రత్యేక న్యాయస్థానం సోమవారం కీలక తీర్పు వెలువరించింది. ఈ కేసులో నిందితుడిగా ఉన్న ఎయిర్‌పోర్ట్ మాజీ అధికారికి మూడేళ్ల కఠిన కారాగార శిక్షతో పాటు రూ. 50,000 జరిమానా విధిస్తూ తీర్పు చెప్పింది.

వివరాల్లోకి వెళితే, కడప ఎయిర్‌పోర్ట్‌లో అసిస్టెంట్ జనరల్ మేనేజర్ (ఎయిర్ ట్రాఫిక్ మేనేజ్‌మెంట్)గా, తాత్కాలిక ఎయిర్‌పోర్ట్ డైరెక్టర్‌గా పనిచేసిన ముకుందగిరి రంగాచారి శ్రీనివాసన్, ఓ కాంట్రాక్టర్‌ను లంచం డిమాండ్ చేశారు. ఆ కాంట్రాక్టర్‌కు రావాల్సిన పెండింగ్ బిల్లులను త్వరగా ప్రాసెస్ చేసేందుకు, అతని సంస్థను బ్లాక్‌లిస్ట్‌లో పెట్టకుండా ఉండేందుకు రూ. 50,000 లంచం ఇవ్వాలని డిమాండ్ చేసినట్లు ఆరోపణలు వచ్చాయి. ఈ వ్యవహారంపై బాధితుడు సీబీఐని ఆశ్రయించడంతో 2015 జూలై 24న శ్రీనివాసన్‌పై కేసు నమోదైంది. అనంతరం, లంచంలో మొదటి విడతగా రూ. 25,000 నగదు తీసుకుంటుండగా సీబీఐ అధికారులు ఆయన్ను రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. తన అధికారిక హోదాను దుర్వినియోగం చేసి లంచం డిమాండ్ చేసినట్లు సీబీఐ తన దర్యాప్తులో నిర్ధారించింది.ఈ కేసుకు సంబంధించి లోతైన దర్యాప్తు జరిపిన సీబీఐ, 2016 ఫిబ్రవరి 29న కోర్టులో ఛార్జిషీట్ దాఖలు చేసింది. సుదీర్ఘ విచారణ అనంతరం, తాజాగా సాక్ష్యాధారాలను పరిశీలించిన కర్నూలు సీబీఐ ప్రత్యేక కోర్టు.. శ్రీనివాసన్‌ను దోషిగా నిర్ధారిస్తూ పైవిధంగా శిక్ష ఖరారు చేసింది. ఈ మేరకు సీబీఐ ఒక ప్రకటనలో వివరాలను వెల్లడించింది.

# రాయలసీమ వనరులు తీవ్రంగా దోపిడీకి గురయ్యాయి

- మొదటి పేజి తరువాయి

బీజేపీ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా సీమ ప్రాంత స్థితిగతులు, ఎదుర్కొంటున్న సవాళ్లు మరియు భవిష్యత్ కార్యాచరణపై ఆయన కీలక వ్యాఖ్యలు చేశారు. స్వాతంత్ర్యం వచ్చిన నాటి నుంచి రాయలసీమ ప్రాంతం తీవ్ర వెనుకబాటుతనానికి గురైందని, ఇక్కడి ప్రాకృతిక, మానవ వనరులు దోపిడీకి గురయ్యాయని అన్నారు. ఈ ప్రాంతం నుంచి ఎందరో ముఖ్యమంత్రులు ప్రాతినిధ్యం వహించినప్పటికీ.. రాయలసీమ అభివృద్ధిలో ఎందుకు వెనుకబడిపోయిందో అర్థం కాని పరిస్థితి నెలకొందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ వెనుకబాటుతనాన్ని అధిగమించేందుకు నాయకులు, మేధావులు ఒకే తాటిపైకి వచ్చి సీమ అభివృద్ధికి ప్రత్యేక ప్రణాళికలు రచించాలని పిలుపునిచ్చారు.సీమ పురోగతి కోసం ఆయన ‘ప్రజలు, పాడిపంటలు, పరిశ్రమలు, పర్యటకం, పర్యావరణం’ విధానాన్ని సూచించారు. వచ్చే 20 ఏళ్లలో రాయలసీమను ఏ విధంగా అభివృద్ధి చేయాలనే దానిపై సమగ్ర డాక్యుమెంటరీని రూపొందించడమే కాకుండా, దాన్ని ఆచరణలో సాధించి తీరాలని అన్నారు.

# మహిళా రెజ్లర్లపై లైంగిక వేధింపుల కేసులో తీర్పు.. నిర్దోషిగా బ్రిజ్ భూషణ్

మహిళా రెజ్లర్లపై లైంగిక వేధింపుల ఆరోపణల కేసులో భారత రెజ్లింగ్ సమాఖ్య (డబ్ల్యూఎఫ్ఐ) మాజీ అధ్యక్షుడు, బీజేపీ నేత బ్రిజ్ భూషణ్ శరన్ సింగ్‌కు భారీ ఊరట లభించింది. ఈ కేసులో ఆయనను, మరో నిందితుడు వినోద్ తోమర్‌ను నిర్దోషులుగా తేలుస్తూ ఢిల్లీలోని రౌస్ అవెన్యూ కోర్టు నేడు తీర్పు వెలువరించింది. దీంతో దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన ఈ కేసుకు తెరపడినట్లయింది.తీర్పు వెలువడిన వెంటనే బ్రిజ్ భూషణ్ ‘ఎన్డీటీవీ’తో మాట్లాడుతూ తన ఆనందాన్ని వ్యక్తం చేశారు. “నాపై ఆరోపణలు వచ్చిన రోజే చెప్పాను.. అవి రుజువైతే ఉరి వేసుకుంటానని. ఈ రోజు కోర్టు నన్ను గౌరవప్రదంగా నిర్దోషిగా తేల్చింది. జరిగిందేదో జరిగిపోయింది” అని ఆయన వ్యాఖ్యానించారు.డబ్ల్యూఎఫ్ఐ చీఫ్‌గా ఉన్నప్పుడు బ్రిజ్ భూషణ్ తమపై లైంగిక వేధింపులకు పాల్పడ్డారంటూ పలువురు మహిళా రెజ్లర్లు ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద పెద్ద ఎత్తున నిరసనలు చేపట్టిన విషయం తెలిసిందే. ఈ నిరసనల నేపథ్యంలో ఢిల్లీ పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు. విచారణ పూర్తి చేసిన అనంతరం 2023 జూన్ 15న సుమారు 1500 పేజీల ఛార్జ్‌షీట్‌ను కోర్టులో దాఖలు చేశారు.

భారత రెజ్లింగ్ సమాఖ్య అధిపతిగా ఉన్న సమయంలో స్వదేశీ, విదేశీ మహిళా రెజ్లర్ల పట్ల బ్రిజ్ భూషణ్ అసభ్యంగా ప్రవర్తించారని ఆరోపణలు వచ్చాయి. సుదీర్ఘ విచారణ అనంతరం కోర్టు ఆయనను, సహ నిందితుడు వినోద్ తోమర్‌ను నిర్దోషులుగా ప్రకటిస్తూ తీర్పు ఇచ్చింది.

# జిల్లా కలెక్టరేట్ పీజీఆర్ఎస్, రెవెన్యూ క్లినిక్ లో 219 అర్జీలు



**– కలెక్టర్ కీర్తి చేకూరి**

**రాజమహేంద్రవరం, పెన్ పవర్, ఆగస్ట్ 3 :** రాష్ట్ర ప్రభుత్వం ప్రజా సమస్యల పరిష్కారంలో ఐవీఆర్ఎస్‌కు ప్రాధాన్యత ఇస్తోందని, ప్రతి అర్జీని నిర్ణీత గడువులో జవాబుదారీ తనంతో పరిష్కరించా లని జిల్లా కలెక్టర్ కీర్తి చేకూరి అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన పీజీఆర్ఎస్, రెవెన్యూ క్లినిక్ కార్యక్రమంలో కలెక్టర్ పీజీఆర్ఎస్ అర్జీలను, జాయింట్ కలెక్టర్ రెవెన్యూ క్లినిక్ అర్జీలను స్వీకరించారు.

రెవెన్యూ (రెవెన్యూ క్లినిక్) 94 అర్జీలు , పంచాయతీ రాజ్ గ్రామీణాభివృద్ధి శాఖకు 46, హోం శాఖకు 23, ఎనర్జీ శాఖకు 9, మానవ వనరులు (పాఠశాల విద్య) శాఖకు 7 అర్జీలు అందాయి. పశుసంవర్ధక, మహిళా--శిశు--వికలాంగులు--వృద్ధుల సంక్షేమం, మున్సిపల్ పరిపాలన, హౌసింగ్, స్వర్ణ గ్రామం--స్వర్ణ వార్డు, మైనారిటీ సంక్షేమం, వ్యవసాయం--సహకారం, బీసీ సంక్షేమం, రవాణా--ఆర్‌డబీ, సాంఘిక సంక్షేమం, నైపుణ్యాభివృద్ధి, వైద్యారోగ్యం, పౌరసర ఫరాలు, ఉన్నత విద్య తదితర శాఖలకు చెందిన 40 వినతులు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి ఎస్. భాస్కర్ రెడ్డి, సీపీఓ ఎల్. అప్పలకొండ, ఆర్డీవోలు కె. ఆనందరావు, ఆర్. శివరాముడు, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ పి. భాగ్యవతి డివిల్డివో పి వీణాదేవి, తదితర అధికారులు పాల్గొన్నారు.

# పెన్ పవర్

పోలవరం - ఏలూరు

తూర్పుగోదావరి - పశ్చిమ గోదావరి

## విధ్వంసం నుంచి వికాసం వైపు రాష్ట్రాన్ని నడిపిస్తున్నది కూటమి ప్రభుత్వం

**ఎమ్మెల్యే మిరియాల శిరీషాదేవి**



**గంగవరం/వై.రామవరం, పెన్ పవర్, ఆగస్టు 3:** విధ్వంసం నుంచి వికాసం వైపు రాష్ట్రాన్ని నడిపిస్తున్న చరిత్ర కూటమి ప్రభుత్వానిదేనని రాష్ట్ర ఎస్టీ సంక్షేమ కమిటీ చైర్‌పర్సన్, రంపచోడవరం ఎమ్మెల్యే మిరియాల శిరీషాదేవి అన్నారు. గంగవరం మండలం మోహనపురం, శరభవరం గ్రామాలతో పాటు వై.రామవరం మండలం గండేపల్లి, సింహాద్రిపాలెం గ్రామాల్లో సోమవారం నిర్వహించిన "రెండేళ్ల నమ్మకం -- సంక్షేమం, అభివృద్ధిపై ఇంటింటికీ తెలుగుదేశం" కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. గంగవరం టీడీపీ మండల అధ్యక్షుడు పల్లాల వెంకటరెడ్డి, వై.రామవరం మండల అధ్యక్షుడు పొత్తూరి కాంతారెడ్డి ఆధ్వర్యంలో కార్యక్రమం జరిగింది. గ్రామాలకు చేరుకున్న ఎమ్మెల్యేకు కూటమి పార్టీ నాయకులు, కార్యకర్తలు, గ్రామస్తులు ఘన స్వాగతం పలికారు. అనంతరం ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలపై కరపత్రాలను పంపిణీ చేస్తూ ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, గత ప్రభుత్వం రాష్ట్రాన్ని అభివృద్ధి పరంగా వెనక్కి నెట్టిందని, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలోని కూటమి ప్రభుత్వం రాష్ట్రాన్ని తిరిగి అభివృద్ధి బాటలో నడిపిస్తోందన్నారు. అమరావతిని దేశంలోనే ప్రముఖ ఆర్థిక కేంద్రంగా తీర్చిదిద్దేందుకు చర్యలు చేపడుతున్నట్లు చెప్పారు. ఎన్నికల హామీలతో పాటు ప్రజలకు అవసరమైన అనేక సంక్షేమ కార్యక్రమాలను కూడా ప్రభుత్వం అమలు చేస్తోందని పేర్కొన్నారు. ఎన్టీఆర్ సామాజిక భద్రత పింఛన్ల పెంపు, మహిళలకు స్త్రీ శక్తి పథకం ద్వారా ఉచిత బస్సు ప్రయాణం, రాష్ట్రవ్యాప్తంగా 269 అన్నా క్యాంటీన్ల నిర్వహణ, రైతులకు అవసరమైన ఎరువుల సరఫరా, అన్నదాత సుఖీభవ--పీఎం కిసాన్, తల్లికి వందనం, దీపం పథకం కింద ఏడాదికి మూడు గ్యాస్ సిలిండర్ల రాయితీ, ఆటో డ్రైవర్లకు ఆర్థిక సాయం, మత్స్యకారులకు వార్షిక ఆర్థిక సహాయం, చేనేత కార్మికులు, నాయీ బ్రాహ్మణులకు ఉచిత విద్యుత్ వంటి పథకాలను ప్రజలకు వివరించారు. అర్హులైన ప్రతి లబ్ధిదారునికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ప్రజలు పలు సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకురాగా, సంబంధిత శాఖల అధికారులతో మాట్లాడి వెంటనే పరిష్కార చర్యలు చేపట్టాలని ఆమె ఆదేశించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ గంగవరం మండల అధ్యక్షుడు పల్లాల వెంకటరెడ్డి, వై.రామవరం మండల అధ్యక్షుడు పొత్తూరి కాంతారెడ్డి, బీజేపీ జిల్లా అధ్యక్షుడు ఈకా బుల్లికొండలు దొర, టిడిపి ప్రధానకార్యదర్శి కనిగిరి సుభాష్, కుంజం చిన్నాలు దొర, మాజీ ఎంపీపీ గొర్లె శ్రీకాంత్, మాజీ జడ్పీటీసీ పల్లాల వెంకటరమణరెడ్డి, మద్దేటి వెంకటరెడ్డి జనసేన మండల అధ్యక్షుడు కుంజం సిద్ధు, రావడి పుష్పరాజ్, టీఎన్ఎస్ఎఫ్ నియోజకవర్గ అధ్యక్షుడు ముచ్చకర్ల శివ, కింటుకూరి రాంబాబు, మద్దికొండ ప్రసాద్, జి. చిన్నారావు, , బొగ్గుల అబ్బాయి రెడ్డి, పి. ఆదినారాయణ, బూత్ ఇన్‌చార్జి బొగ్గుల సత్తిబాబు, వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు, టీడీపీ, బీజేపీ, జనసేన నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# ప్రమాదకరంగా గోదావరి గట్టు పనులు



- పాలకుల, అధికారుల నిర్లక్ష్యం పై క్రిమినల్ కేసులు పెట్టాలి
- 5న దేవరాపల్లిలో పొగాకు రైతులకు జగన్ పరామర్శ
- వైసిపి జాతీయ అధికార ప్రతినిధి మార్గాని భరత్ రామ్



**రాజమహేంద్రవరం, పెన్ పవర్, ఆగస్ట్ 3:** కూటమి ప్రభుత్వం రివర్ ఫ్రంట్ పేరుతో భద్రతా ప్రమాణాలను పట్టించు కోకుండా గోదావరి గట్టు సుందరీకరణ పనులు పనులు చేపట్టి నగరాన్ని ప్రమాదంలోకి నెట్టిందని మాజీ ఎంపీ, వైసిపి జాతీయ అధికార ప్రతినిధి, సిటీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ మార్గాని భరత్ రామ్ మండిపడ్డారు. స్థానిక పద్మావతి ఘాటు సమీపంలో ఇరిగేషన్ శాఖ ప్రమాణాలను త్రోసి వంతెన నిర్మించడం వల్ల గోదావరి గట్టు మట్టి అండలుగా జారిపోయి బండ్ రోడ్డు కూలి లోతట్టు లో ఉన్న నగరం వరద తాకిడికి గురయ్యేదని ఆందోళన వ్యక్తం చేశారు. నిర్మాణం తలపెట్టినప్పుడే ఇరిగేషన్ శాఖ అధికారుల ప్రమేయం లేకుండా మున్సిపల్ అధికారులు, ప్రజా ప్రతినిధులు సొంతం గా పనులు చేపట్టడం బాధ్యతా రాహిత్యమేనని విమర్శించారు. సోమవారం ఆయన వైసిపి నాయకులతో కలిసి స్థానిక పద్మావతి ఘాట్ సమీపంలో నిర్మాణంలో ఉన్న రివర్ ఫ్రంట్ పనులను పరిశీలించారు. గోదావరి బండ్ రోడ్డు కృంగిపోకుండా వేసిన ఇసుక బస్తాలను చూసి అదికారులు, ప్రజా ప్రతినిధులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. గోదావరి నది ఉగ్రరూపం ఊహించ లేమని ప్రస్తుతం రెండో ప్రమాద హెచ్చరిక స్థాయిలో ఉందన్నారు. పై స్థాయిలో వర్షాలు పడితే లక్షల క్యూసెక్కుల వరదనీరు ధవళేశ్వరం బ్యారేజీ నుంచి వెనక్కి తన్నితే ఊహించని ప్రమాదం జరుగు తుంద న్నారు. ప్రమాదవ శాత్తు గోదావరి గట్టు కూలిపోతే ఎదురయ్యే పరిస్థితులకు ఎవరూ బాధ్యత వహిస్తారని ప్రశ్నించారు. అధికారుల నిర్లక్ష్యానికి వారిపై క్రిమినల్ కేసులు పెట్టాలని, లేకపోతే తాము హైకోర్టుని ఆశ్రయిస్థామని హెచ్చరించారు. ఇరిగేషన్ అధికారుల సూచనలు, నిబంధనలు పాటిస్తూ చేయాల్సిన పనుల పై మున్సిపల్ శాఖ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించడం దారుణమన్నారు. కోటిలింగాల ఘాట్ లో ఏర్పాటు చేసిన ఓపెన్ థియేటర్ స్క్రీన్ వరద నీటిలో మునిగి పోయిందని, ముందుగానే పది అడుగుల ఎత్తులో నిర్మాణం చేస్తే నష్టం జరిగేది కాదన్నారు. కంబాలచెరువు పార్కులోఉన్న పంపింగ్ స్టేషన్ ద్వారా వర్షపు నీటిని ఎబి నాగేశ్వర రావు పార్కులోకి అక్కడి నుంచి నల్ల ఛానల్ ద్వారా బయటకు పంపే ఏర్పాటు చేసామన్నారు. అయితే అధికారులు అనాలోచితంగా వ్యవ హరిస్తూ నగరమంతా మునిగిపోయేలా చేస్తున్నారని విమ ర్శించారు. రైల్వే స్టేషన్ రోడ్డు వరద, మురికి నీరు ముంపు బారిన పడు తోందని ఆందోళన వ్యక్తం చేసారు. వెనక బడిన వర్గాలే (బి సి) లక్ష్యంగా కూటమి ప్రభుత్వం, ముఖ్యమంత్రి చంద్రబాబు జంగిల్ రాజ్ రాజ్యం ఏలుతున్నారని విమర్శించారు. పోలీ సులను ఉపయో గించుకుని వైసీపీ బీసీ నాయకులపై అక్రమంగా అరెస్టులు, దాడులు చేయిస్తున్నారని ధ్వజమెత్తారు. జోగి రమేష్, కారుమూరి సునీల్, సీదిరి అప్పల రాజు, ఎమ్మెల్యే విరుపాక్షి వరకు వైసిపి వారిపై తప్పుడు కేసులు, అక్రమ అరెస్టులు చేసి జైలుకు పంపు తున్నా రన్నారు. అన్ని అక్రమ అరెస్టులపై సమగ్ర విచారణ జరిపించాలని డిమాండ్ చేసారు. అధికారం శాశ్వతం కాదని, తమ ప్రభుత్వం అధికారంలోకి వస్తే ఖచ్చితంగా మూల్యం చెల్లిస్తామని హెచ్చ రించారు. ఈనెల 5వ తేదీన పొగాకు రైతులకు మద్ధతుగా దేవరపల్లిలో మాజీ ముఖ్యమంత్రి, వైసిపి అధినేత వైఎస్ జగన్మోహన్ రెడ్డి పర్యటిస్తున్నారని, ఆ పర్యటనకు రైతులు తరలిరావాలని పిలుపు నిచ్చారు. పొగాకు రైతులకు మద్ధతు ధర కల్పించడంలో కేంద్ర మంత్రులకు బాధ్యత లేదా అని నిలదీసారు. భోగాపురం ఎయిర్ పోర్టు నిర్మాణ ఘనత మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డికే దక్కుతుందన్నారు. ఆయన వెంట బీసీ నాయకులు మార్గాని నాగేశ్వరరావు, పార్టీ సీనియర్ నాయకులు, వార్డు ఇంచార్జీలు శ్రేణులు పాల్గొన్నారు.

## వరదబాధితుల సమస్యలను అడిగి తెలుసుకున్న జిల్లా కలెక్టర్,



**–ప్రభుత్వ,వివిధశాఖల సంబంధితఅధికారులు**

**వి.ఆర్.పురం పెన్.పవర్.ఆగస్టు.3** జిల్లా కలెక్టర్,కె.దినేష్ కుమార్,సోమవారంవరద బాధితులను,పరామర్శించి,సమస్యలనుఅడిగి తెలుసుకున్నారు.జిల్లా కలెక్టర్,కె.దినేష్ కుమార్, కు,మండలజనసేనపార్టీఅధ్యక్షులు,ములకాల సాయికృష్ణ,గోదావరి,శబరి వరదల పరిస్థితులను తెలియజేస్తూ,పోలవరంప్రాజెక్టుకారణంగా సర్వం కోల్పోతున్న,నిర్వాసితులసమస్యలనువివరించారు. జిల్లాయంత్రాంగం,వివిధశాఖల అధికారుల పనితీరు చాలాబాగుందని,ముంపుకు గురైన ప్రతి గ్రామానికి నిత్యవసర,సరుకులు అందజేయాలని,గత సంవత్సర వరద నష్టపరిహారంఅందజేయాలని,పోలవరం నిర్వా సితుల,సమస్యలుపూర్తిస్థాయిలో పరిష్కరించాలని,18 సంవత్సరాలు నిండినయువతీ యువకులకు ఆర్.అండ్.ఆర్.ప్యాకేజీ వర్తింపజేయాలని,వడ్డిగూడెంపంచాయతీకు సంబంధించి,మిగిలినగృహాలవిలువనష్టపరిహారం అంద జేయాలని,కోరారు.ఈ విషయంపై కలెక్టర్,సానుకూలంగా స్పందించి,నిత్యవసర సరుకులు రేపటి నుంచి పంపిణీ చేస్తామని,20రోజుల్లో గత సంవత్సర వరద నష్ట పరిహారం అందజేస్తామని,కూటమిప్రభుత్వం,నిర్వాసితులసమస్యల పట్ల,సానుకూలంగాఉందని,అభివృద్దిపదంలోముందుకుఅడుగు లువేస్తుందని,తెలిపారు.ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ ఎస్.ప్రశాంత్ కుమార్,చింతూరు ఐటీడీఏ శుభం నొక్వాల్,చింతూరు ఏ.ఎస్పీ బొడ్డు హేమంత్,వివిధ శాఖల అధికారులు,ప్రజాప్రతినిధులు,వివిద పార్టీల నాయకులు, వరద బాధితులు,నిర్వాసితులు పాల్గొన్నారు.

# వరద అనంతరం పునరుద్ధరణే లక్ష్యం




**-118 గ్రామాల్లో 2200 మందికి సహాయం కలెక్టర్ దినేష్ కుమార్**

**-వరద తగ్గింది,ఇక వ్యాధులపై యుద్ధం**

**-ఇంటింటి ఆరోగ్య సర్వే, రోడ్ల మరమ్మత్తులకు ఆదేశం**





**కూనవరం,పెన్ పవర్,ఆగస్టు3.** గోదారమ్మ శాంతించడంతో వరద అనంతర పునరుద్ధరణ చర్యలను వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ కె దినేష్ కుమార్ అధికారులకు దిశా నిర్దేశం చేశారు.సోమవారం కూనవరం తహసీల్దార్ కార్యాలయంలో చింతూరు డివిజన్ పరిధిలోని 4 మండలాల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు.వరద ముంపుకు గురైన బాధితులను జిల్లా యంత్రాంగం సురక్షితంగా పునరావాస కేంద్రాలకు తరలించినట్లు కలెక్టర్ తెలిపారు. 118 పునరావాస కేంద్రాల్లో 2,200 మంది ఉంటున్నారని,వారికి అవసరమైన వసతి,భోజనం, వైద్యం,దోమతెరలు ఏర్పాటు చేశామన్నారు.వరద పూర్తిగా తగ్గిన తర్వాత వారిని తిరిగి సొంత ఇళ్లకు పంపుతామని చెప్పారు12,400 వరద ముంపు కుటుంబాలను గుర్తించామని,వారందరికీ 25 కేజీల బియ్యం,కందిపప్పు,ఉల్లిపాయలు, దుంపలు,1 కేజీ మంచి నూనె చొప్పున పంపిణీ చేస్తున్నామని వివరించారు. సెప్టెంబర్ నెల రేషన్‌ను కూడా ముందుగానే విడుదల చేయనున్నందున పంపిణీలో ఎలాంటి అంతరాయం ఉండకూడదని గ్రామ,మండల స్థాయి నోడల్ అధికారులను ఆదేశించారు.వరద కారణంగా 47 రహదారులు ముంపునకు గురయ్యాయని,వరద తగ్గడంతో ఈరోజు సాయంత్రానికి అన్ని రోడ్లు క్లియర్ చేస్తామన్నారు.ఫైర్ ఇంజన్, బ్లేడ్ ట్రాక్టర్ల ద్వారా రోడ్లపై పేరుకున్న బురదను శుభ్రం చేస్తున్నామని చెప్పారు.9 వేల విద్యుత్ కనెక్షన్లు నిలిచిపోగా,60 శాతం పునరుద్ధరించామని, మిగిలిన 40శాతం ఈరోజే పూర్తి చేస్తామన్నారు.రోగానికి చికిత్స కంటే ముందస్తు నివారణ మేలు అంటూ కలెక్టర్ కీలక సూచనలు చేశారు.నీరు నిల్వ ఉన్న ప్రాంతాల్లో మలేరియా,డెంగ్యూ,టైఫాయిడ్, విషజ్వరాలు ప్రబలకుండా పంచాయతీరాజ్ శాఖ ద్వారా యుద్ధ ప్రాతిపదికన శానిటేషన్ పనులు చేపట్టాలని ఆదేశించారు. ప్రతి ఇంటిని సందర్శించి ఇంటింటి ఆరోగ్య సర్వేను నిర్ణీత గడువులో పూర్తి చేయాలని,జ్వరం, విరేచనాలు,చర్మవ్యాధులు ఉన్నవారికి వెంటనే వైద్యం అందించాలని తెలిపారు. దోమల నివారణ,క్లోరినేషన్,పారిశుధ్య పనులు నిరంతరం కొనసాగాలన్నారు.వరద ప్రభావిత గ్రామాల్లో అధికారులు,సిబ్బంది క్షేత్రస్థాయిలో ఉండి సమయానికి స్పందించడంతో నష్టాన్ని తగ్గించగలిగామని కలెక్టర్ అధికారులను ప్రశంసించారు. చింతూరు డివిజన్‌లో జిల్లా యంత్రాంగం మొత్తం వరద ప్రాంతాల్లోనే ఉందని,పూర్తిగా తగ్గిన తర్వాతే ఇక్కడి నుంచి వెళ్తామని ప్రజలు ఎవరూ ఆందోళన చెందవద్దని భరోసా ఇచ్చారు. మండలంలోని టేకుబాక గ్రామంలో వరద బాధితులకు నిత్యవసర వస్తువులను కలెక్టర్ కె. దినేష్‌కుమార్,జాయింట్ కలెక్టర్ ఎస్. ప్రశాంత్‌కుమార్,ఐపిడిఏ పిఓ శుభం నోక్వాల్,ఏఎస్పి బి.హేమంత్ ఆయిల్,బియ్యం,కందిపప్పు,ఉల్లి, బంగాళదుంపలు పంపిణీ చేసి బాధితులకు అన్ని విధాలా అండగాఉంటామని కలెక్టర్ హామీ ఇచ్చారు.ఈ సమావేశంలో జిల్లా అధికారులు,తహశీల్దార్లు, ఎంపీడీఓ లు పాల్గొన్నారు.

# సైబర్ నేరాలు, మహిళల భద్రత,పోక్సోచట్టాలపై పోలీసులు అవగాహన కార్యక్రమం...




**అడ్డతీగల, పెన్ పవర్, ఆగస్ట్ 03;** సోమవారం అడ్డతీగల సర్కిల్ ఇన్‌స్పెక్టర్ ఎం.గజేంద్ర కుమార్ మరియు అడ్డతీగల సబ్ ఇన్‌స్పెక్టర్ బి. వినోద్ ఆధ్వర్యంలో అడ్డతీగల జెడ్. పి హై స్కూల్ అడ్డతీగలను సందర్శించి విద్యార్థులకు సైబర్ నేరాలు, పోక్సో చట్టం, మహిళల భద్రత మరియు గంజాయి వంటి మాదక ద్రవ్యాల కలిగే దుష్పరిణామాలపై విస్తృత అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు.

ఈ కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు ప్రస్తుత కాలంలో పెరుగుతున్న సైబర్ నేరాల గురించి, వివరంగా అవగాహన కల్పించారు. ముఖ్యంగా ఫోన్ కాల్స్, ఎస్ఎంఎస్‌లు, వాట్సాప్ సందేశాలు, సోషల్ మీడియా ప్లాట్‌ఫారమ్‌లు మరియు నకిలీ వెబ్‌సైట్ల ద్వారా జరుగుతున్న మోసాల గురించి మరియు బ్యాంకు ఖాతా వివరాలు, ఏటీఎం కార్డు నంబర్లు, సీవీవీ నంబర్లు, ఓటీపీలు మరియు ఇతర వ్యక్తిగత సమాచారాన్ని ఎవరికీ తెలియజేయకూడదని అడ్డతీగల సీఐ ఎం.గజేంద్ర కుమార్ సూచించారు. అడ్డతీగల ఎస్ ఐ బి.వినోద్ మాట్లాడుతూసైబర్ మోసాలకు గురైనట్లయితే వెంటనే 1930 సైబర్ హెల్ప్‌లైన్ లేదా సమీప పోలీస్ స్టేషన్‌ను సంప్రదించాలని తెలియజేశారు.

అదేవిధంగా పోక్సో చట్టం యొక్క ప్రాముఖ్యత, చిన్నారుల హక్కులు, వారిపై జరిగే లైంగిక వేధింపులు, దుర్వినియోగాలు మరియు వాటి నివారణకు సంబంధించిన చట్టపరమైన అంశాలను విద్యార్థులకు వివరించారు. పాఠశాల, ఇంటి పరిసరాలు లేదా ఇతర ప్రాంతాలలో ఏదైనా అనుచిత ప్రవర్తన ఎదురైనప్పుడు భయపడకుండా తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు లేదా పోలీసులకు వెంటనే తెలియజేయాలని ఎస్ఐ వినోద్ సూచించారు.

అలానే మహిళల భద్రత అంశంపై మాట్లాడుతూ, బాలికలు మరియు మహిళలు తమ భద్రత పట్ల ఎల్లప్పుడూ అప్రమత్తంగా ఉండాలని, అత్యవసర పరిస్థితుల్లో పోలీసుల సహాయాన్ని పొందాలని, చట్టపరమైన రక్షణలు మరియు మహిళల కోసం అందుబాటులో ఉన్న హెల్ప్‌లైన్ సేవల గురించి అవగాహన కలిగి ఉండాలని సూచించారు. సమాజంలో మహిళల పట్ల గౌరవభావంతో వ్యవహరించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని తెలిపారు.

అలాగే గంజాయి మరియు ఇతర మాదక ద్రవ్యాల వినియోగం వల్ల కలిగే ఆరోగ్య, మానసిక, సామాజిక మరియు చట్టపరమైన దుష్పరిణామాలను వివరించారు. మాదక ద్రవ్యాల అలవాటు వ్యక్తిగత జీవితాన్ని మాత్రమే కాకుండా, కుటుంబం మరియు సమాజంపై కూడా ప్రతికూల ప్రభావం చూపుతుందని తెలిపారు. గంజాయి మరియు ఇతర మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండి విద్యార్థులు తమ విద్య, క్రీడలు మరియు వ్యక్తిత్వ వికాసంపై దృష్టి సారించాలని సూచించారు.

కార్యక్రమంలో విద్యార్థులు అడిగిన పలు ప్రశ్నలకు సీఐ ఎం. గజేంద్ర కుమార్ సమాధానాలు ఇచ్చి వారికి అవసరమైన సూచనలు అందించారు. విద్యార్థులు చట్టాల పట్ల అవగాహన పెంపొందించుకొని, సైబర్ నేరాలు మరియు మాదక ద్రవ్యాలకు దూరంగా ఉంటూ, మంచి పౌరులుగా ఎదిగి సమాజ అభివృద్ధికి తోడ్పడాలని కోరారు. ఈ అవగాహన కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు మరియు విద్యార్థులు పాల్గొన్నారు.

# రామకృష్ణ మిషన్ ఉచిత వైద్య శిబిరం





**సీతానగరం, పెన్ పవర్, ఆగస్టు:03:**రామకృష్ణ మిషన్ గిరిజన సంచార వైద్యశాల రాజమహేంద్రవరం ఆధ్వర్యంలో సోమ వారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు.మండలంలోని సీతానగరం గ్రామంలో లో కస్తూరిబా గాంధీ ఆశ్రమంలో ప్రత్యేక వైద్య శిబిరం నిర్వహించినట్లు రామకృష్ణ మిషన్ కార్యదర్శి స్వామీ పరిజ్ఞేయా నందజీ మహారాజ్ తెలిపారు.

ఈ వైద్య శిబిరం లో డా. శ్రీనివాస్ రాయుడు. డా .సత్యం రమేశ్ బాబు. సుమారు 300మందికి రోగులకు వైద్యసేవలు అందించారు. వీరిలో 110 మందికి రక్త నీరుడు పరీక్షలు 6 గురికి ,థైరాయిడ్ ఒకరి కి ఇ.సి. జి. పరీక్షలు నిర్వహించారు .పరమహంస యోగానంద నేత్రలయ వేమగిరి వారిచే సుమారు 88మందికి కంటి పరీక్షలు నిర్వహించి వారిలో 15 మందిని శుక్లాం ఆపరేషన్ నిమిత్తం వేమగిరి ఆసుపత్రి కి తరలించారు. 10 మందికి కళ్లజోళ్లు పంపిణీ చేశారు. ఈ శిబిరంలో పరమహంస యోగానంద నేత్ర లయ ప్రోగ్రాం మేనేజర్ నక్కా చంటిబాబు , సిబ్బంది పాల్గొన్నారు. కస్తూరిబా గాంధీ ఆశ్రమంలో రోగులకు సహాయకులుకు పులిహోర పొట్లాలు పంపిణీ చేశారు.ఈ కార్యక్రమం లో ఆశ్రమప్రతినిధి కుమారి జి. సుశీల ,యాన్నమని వెంకటనారాయణ, రామకృష్ణ మిషన్ కో ఆర్డినేటర్ కానుమో ను శ్రీనివాస్, రామకృష్ణ మిషన్ గిరిజన సంచార వైద్యశాల సిబ్బంది , వాలంటీర్ చిన్నం ప్రేమ్ కుమార్ పాల్గొన్నారు.

# యువత వ్యాపార వేత్తలుగా ఎదగడమే ప్రభుత్వ ధ్యేయం

### గ్లోబల్ బిజినెస్ మీట్ సమాఖ్య 2026 సమావేశంలో మంత్రి కందుల







**రాజమహేంద్రవరం, పెన్ పవర్, ఆగస్ట్ 3**
రాష్ట్రంలో వ్యాపార అభివృద్ధికి, ఆర్థిక ప్రగతికి అనుకూల వాతావరణం ఉందని, వ్యాపార రంగంలోకి వచ్చే యువతను, పారిశ్రామిక వేత్తలను ప్రోత్సహిం చేందుకు కూటమి ప్రభుత్వం సహకారం అందిస్తుందని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కందుల దుర్గేష్ తెలిపారు. స్తానిక మనీష్ ఫంక్షన్ హాల్ లో సమాఖ్య ఛాంబర్ ఆఫ్ కామర్స్' ఆధ్వర్యంలో నిర్వహించిన 'గ్లోబల్ బిజినెస్ మీట్ -- సమాఖ్య 2026' సన్నాహక సమావేశానికి మంత్రి కందుల దుర్గేష్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. రాబోయే అక్టోబర్ 13 నుండి 15 వరకు హైదరాబాద్ లో నిర్వహించనున్న 'గ్లోబల్ బిజినెస్ మీట్' కు సంబంధించిన పోస్టర్‌ను మంత్రి దుర్గేష్ ఆవిష్కరించారు. 'గ్లోబల్ బిజినెస్ మీట్ - 2026' పారిశ్రామిక చిత్రాన్ని మార్చేతుందన్నారు. యువత ఉద్యోగాలకే పరిమితం కాకుండా నలుగురికి ఉపాధి కల్పించే ఎంటర్‌ప్రెన్యూర్ వైపు దృష్టి సారించాలని సూచించారు. 'సమాఖ్య' ఛాంబర్ ఆఫ్ కామర్స్ ప్రయత్నాన్ని ఆయన అభినందించారు.

పర్యాటక రంగంలో పెట్టుబడులు పెట్టే వారికి ప్రభుత్వం పర్యాటక పాలసీ 2024-29 ద్వారా పలు ఆర్థిక, వ్యాపార ప్రోత్సాహకాలను అందిస్తోందని స్పష్టం చేశారు. ఎంఎస్ఎంఈ, స్టార్టప్‌లు, ఆల్ట్రా, మెగా ప్రాజెక్టులు ఆచరణలో పెడితే విజయం సాధించవచ్చన్నారు.

వ్యవసాయ, ఆక్వా, సెరి, హార్టికల్చర్ రంగాల్లో వృద్ధి సాధించిన జిల్లాను పారిశ్రామికంగా ముందుకు తీసుకెళ్లా ల్సిన అవసరం ఉందని మంత్రి కందుల దుర్గేష్ అభిప్రాయపడ్డారు.

# శ్రీ గురజాల అక్కమ్మతల్లి మహోత్సవాల్లో మంత్రి కందుల



**రాజమహేంద్రవరం, పెన్ పవర్, ఆగస్టు 3:**రూరల్ మండలం సాటిలైట్ సిటీలో వైభవంగా జరుగుతున్న శ్రీ గురజాల అక్కమ్మ తల్లి జాతర మహోత్స వాలలో రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక , సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి కందుల దుర్గేష్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు, నిర్వాహ కులు మంత్రి దుర్గేష్ కు స్వాగతం పలికారు. అనంతరం అమ్మవారికి మంత్రి దుర్గేష్ ప్రత్యేక పూజలు నిర్వహించి, శేషవస్త్రంతో పాటు తీర్థప్రసాదాలు స్వీకరించారు.ఈ సందర్భంగా మంత్రి కందుల దుర్గేష్ మాట్లాడుతూ, శ్రీ గురజాల అక్కమ్మ తల్లి ఆశీస్సులతో రాష్ట్రం అభివృద్ధి, ప్రగతి పథంలో ముందుకు సాగాలని ఆకాంక్షించారు. సంస్కృతీ సంప్రదా యాలను, గ్రామీణ జాతరలను కాపాడుకోవడం ప్రజల బాధ్యత అన్నారు.

# జిల్లాలో 41 చోట్ల బియ్యం విక్రయ కేంద్రాలు

### జిల్లా జాయింట్ కలెక్టర్ వై మేఘా స్వరూప్



**రాజమహేంద్రవరం, పెన్ పవర్, ఆగస్ట్ 3:**ప్రభుత్వం చేపట్టిన బియ్యం ధరల స్థిరీకరణ లో భాగంగా తూర్పు గోదావరి జిల్లాలో 41 చోట్ల బియ్యం విక్రయ కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు జాయింట్ కలెక్టర్ వై. మేఘా స్వరూప్ తెలిపారు.

స్తానిక వై జంక్షన్ వద్ద ఏర్పాటు చేసిన రైస్ కౌంటర్‌ను సోమవారం ప్రారంభించిన అనంతరం జాయింట్ కలెక్టర్ మేఘా స్వరూప్ మాట్లాడుతూ, ఆర్ఎన్ఆర్, హెచ్ఎంటీ తదితర రకాల బియ్యం కిలో రూ.52, రా బియ్యం (బీపీటీ) కిలో రూ.50 చొప్పున విక్రయిస్తున్నట్లు తెలిపారు. ప్రతి రైస్ కార్డు కుటుంబానికి నెలకు 26 కిలోల వరకు కొనుగోలు అవకాశం కల్పించడం జరిగిందన్నారు. ఆధార్ కార్డు ఆధారంగా అమ్మకాలు నిర్వహిస్తున్నామని చెప్పారు. ఒకేసారి గరిష్టంగా 10 కిలోలు కొనుగోలు చేయవచ్చని, మూడు దఫాల్లో నెలకు 26 కిలోలు తీసుకోవచ్చు న్నారు. జిల్లాలోని ఎనిమిది రైతుబజార్లు, 33 రైస్ మిల్లర్ అవుట్లెట్ల ద్వారా ప్రభుత్వ ధరలకే నాణ్యమైన సూపర్ ఫైన్, స్టీమ్ బియ్యం విక్రయిస్తామని, విని యోగదారులు సద్విని యోగం చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఆర్ఎన్ఆర్, హెచ్ఎంటీ తదితర రకాల బియ్యం కిలో రూ.52 లు చొప్పున , రా బియ్యం (బీపీటీ) కిలో రూ.50 లు చొప్పున విక్రయిస్తున్నట్లు తెలిపారు. నగరంలో గణేష్ చౌక్, ఆర్ట్స్ కళాశాల, క్వారీ మార్కెట్, వీఎల్‌పురం, నటరాజ్ థియేటర్, లాలాచెరువు, శంభూనగర్ రైతు బజార్లతో పాటు మండపేట రైతుబజారులో కూడా బియ్యం కౌంటర్లు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అదనంగా కొవ్వూరు, కానేడు, వెస్ట్ ఇంద్రిక, నాగులచెరువు, అంగర, మండపేట, ఏడిద, కేశవరం, రాయవరం తదితర ప్రాంతాల్లోని రైస్ మిల్లులు, ట్రేడింగ్ అవుట్లెట్లలో కూడా బియ్యం అందుబాటులో ఉంచినట్లు చెప్పారు.

ఈ కార్యక్రమంలో ఆర్డీవో ఆర్. శివరాముడు, జిల్లా పౌర సరఫరాల అధికారి వి. పార్వతి, సహాయ సంచాలకులు ఎం. సునీల్ వినయ్, ఏఎస్ఓ ఎం. నాగాంజనేయులు, సిఎస్‌డిటి నాగలక్ష్మి, రైతులు, తదితరులు పాల్గొన్నారు.

# రాజమహేంద్రి స్పోర్ట్స్ అకాడమీలో ఉచిత క్రీడా శిక్షణ



**రాజమహేంద్రవరం,పెన్ పవర్ ఆగస్టు 3:**రోజురోజుకు పెరుగుతున్న జనాభాకు ఆటవిడుపుగా, భవిష్యత్తు తరాల కోసం క్రీడల నిర్వహణకు నగరానికి అంతర్జాతీయ క్రీడా మైదానం నిర్మించా ల్సిన అవసరం ఉందని రాజమహేంద్రి విద్యాసంస్థల చైర్మన్ టి కే విశ్వేశ్వర రెడ్డి అన్నారు. విద్యతో పాటు క్రీడాల్లోనూ పిల్లలను ప్రోత్సహించా లన్నారు . తమ విద్యాసంస్థల్లో భాగంగా సంపత్ నగరంలోని రాజమహేంద్రి ఇంటర్నేషనల్ పాఠశాల ఆవరణలో రాజమహేంద్రి స్పోర్ట్స్ అకాడమీ ని ప్రారంభించామని ఏర్పాటు చేశామని తెలిపారు. కళాశాల ఆవరణలో సోమవారం ఆయన మీడియా సమావేశంలో మాట్లాడుతూ, తమ స్పోర్ట్స్ అకాడమీ లో రైఫిల్ షూటింగు, గుర్రపు సారీ, ఆర్చరీ, స్కేటింగ్ క్రీడల్లో ఉచితంగా శిక్షణ ఇస్తున్నామన్నారు. ఈ శిక్షణకు ఐదు సంవత్సరాల నుంచి ఏ వయసు వారైనా అర్హులని, నెలకు కేవలం రూ.500 మాత్రమేనని ఫీజు వసూలు చేస్తున్నామ న్నారు . ప్రతి రోజు ఉదయం 8 గంటల నుంచి 10 గంటల వరకు శిక్షణ ఉంటుందన్నారు. స్కేటింగ్ లో మూడు జాతీయ అవార్డులు పొందిన కె రాజు , గుర్రపు స్వారీ లో గణేష్ లు ఈ కేంద్రంలో శిక్షణ ఇస్తారని టి కే తెలిపారు. గ్రామీణ ప్రాంతాలతో పాటు అర్బన్ ప్రాంతాల్లోని బాల,బాలికలు కు ప్రతి పాఠశాలలోనూ ప్రతి నెల క్రీడల్లో శిక్షణ ఇవ్వాలని రాష్ట్రంలోని అన్ని విద్యాసంస్థలకు స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఆంధ్ర ప్రదేశ్ (శాప్) ఆదేశాలు జారీ చేసిందన్నారు. తూర్పుగోదావరి జిల్లాకు సంబంధించి పాఠశాలల క్రీడ పోటీల నిర్వహణకు జిల్లా స్థాయిలో బడ్జెట్ తయారు చేయించాలని జిల్లా స్పోర్ట్స్ అథారిటీలను శాప్ కోరిందన్నారు. స్కేటింగ్ కోచ్ గణేష్ మాట్లాడుతూ, జిల్లా పాఠశాలల స్థాయిలో క్రీడా పోటీల నిర్వహణకు రాష్ట్ర ప్రైవేటు విద్యా సంస్థల సంఘం చైర్మన్ టి కే విశ్వేశ్వర రెడ్డిని సంప్రదించాలని శాప్ ఆదేశించిందన్నారు.

# ఉత్సాహంగా ఇంటింటికి టీడీపీ.. ప్రజలకు కరపత్రాలు అందజేస్తున్న బొడ్డు



**సీతానగరం, పెన్ పవర్, ఆగస్టు:03:**ఇంటింటికి తెలుగుదేశం పార్టీ కార్యమంలో భాగంగా మండలంలోని రాజానగరం నియోజకవర్గ టిడిపి ఇంచార్జ్
రుడా చైర్మన్ తూర్పు గోదావరి జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు బొడ్డు వెంకట రమణ చౌదరి తెలుగు దేశం
పార్టీ నేతలు ఆదివారం నాడు బొబ్బిలంక గ్రామంలో ప్రజల వద్దకు కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాల గురించి ఇంటింటికి వెళ్లి వివరిస్తూ కరపత్రాలు అందించారు. ఈ సందర్భంగా టిడిపి ఇన్చార్జ్ బొడ్డు వెంకట రమణ చౌదరి మాట్లాడుతూ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఉప ముఖ్యమంత్రి కొణిదెల పవన్ కళ్యాణ్ సారాధ్యంలో కూటమి ప్రభుత్వంలో పెద్ద ఎత్తున అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్నట్లు తెలిపారు. ప్రభుత్వ విశిష్టతను ప్రజలకు తెలియజేశారు. పేదల సంక్షేమాన్ని మాటల్లో చూపించే పాలనకు ఉన్న తేడాను రాష్ట్ర ప్రజల స్పష్టంగా చూస్తున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో మండలం తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు గెడ్డం తిమ్మారావు,టిడిపి నాయకులు ఆశన్న బాబు, చిట్టూరి రంగారావు, గద్దె వెంకటకృష్ణ చౌదరి, పోలిన కృష్ణ, పోలిన పృథ్వీ , కాండ్రు శేఖర్, సోషల్ మీడియా కన్వీనర్ పుక్కాల శ్రీనివాస్, టిడిపి నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# చలో ఢిల్లీ గోడపత్రిక ఆవిష్కరణ




**జీలుగుమిల్లి ,పెన్ పవర్, ఆగస్టు 3;**సెప్టెంబర్ 1 న ఢిల్లీలోని రామ్ లీలా మైదానంలో మార్పు అవసరం ర్యాలీ నిర్వహించనున్నట్లు సిపిఐ మండల కార్యదర్శి కారం ధారయ్య పేర్కొన్నారు. సోమవారం సిపిఐ పార్టీ ఆధ్వర్యంలో పి అంకంపాలెం గ్రామంలో గోడ పత్రికను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 6వ తేదీ నుండి 15 తేదీ వరకు మండల వ్యాప్తంగా పాదయాత్ర కొనసాగుతుందని అన్నారు. 17వ తేదీ నుంచి 27 వ తేదీ వరకు ప్రజాసంఘాల ఆందోళనలు నిర్వహించనున్నట్లు తెలిపారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అనుచితమైన విధానాలను మానుకోవాలని ఢిల్లీలో ర్యాలీ చేయనున్నట్లు తెలిపారు. ఈనెల తొమ్మిదో తారీఖున జీలుగుమిల్లి మండలంలో జరిగే ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కొప్పుల నాగరాజు ,కొక్కిర గడ్డ ఆనందరావు, కురసం వీరభద్రశీ, కొవ్వాసి శీను ,ఎం రాజు ,నార్లపాటి చి న్నయ్య తదితరులు పాల్గొన్నారు.

## కార్పొరేషన్ పీజీఆర్ఎస్ లో 25 అర్జీలు



**రాజమహేంద్రవరం, పెన్ పవర్, ఆగస్టు 3**
ప్రజా సమస్యల పరిష్కార వేదికలో వచ్చే అర్జీలను పెండింగ్ లో ఉంచకుండా నాణ్యమైన పరిష్కారం చూపాలని కమిషనర్ రాహుల్ మీనా ఆదేశించారు. నగరపాలక సంస్థ కార్యాలయంలోని పీజీఆర్ఎస్ సోమవారం నిర్వహించారు. ప్రజల నుంచి 25 అర్జీలు, ఫిర్యాదులు స్వీకరించారు. వీటిలో ఇంజనీరింగ్ కి 8, రెవెన్యూకి 2, టౌన్ ప్లానింగ్ కి 3, పబ్లిక్ హెల్త్ కి 3, వార్డు సచివాలయాలకు 6, హౌసింగ్ కి 3 ఉన్నాయి. ఆయా సమస్యలకు పరిష్కారం చూపాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. అర్జీల పరిష్కారం గురించి ప్రభుత్వం ప్రజాభిప్రాయం సేకరిస్తుందని, అర్జీలను సమగ్రంగా పరిశీలించి పరిష్కరించాలని అధికారులకు సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన 1100 కాల్ సెంటర్ సేవలను సద్వినియోగపరచుకోవాలన్నారు. కార్యక్రమంలో అదనపు కమిషనర్ పి.వి.రామలింగేశ్వర్, డిప్యూటీ కమిషనర్ ఎస్.వెంకటరమణ, సెక్రటరీ శైలజవల్లి, ఎస్ఈ రీటా, సిటీ ప్లానర్ జి.వి.ఎస్.ఎన్.మూర్తి, ఎంహెచ్ఓ వినూత్న, మేనేజర్ అబ్దుల్ మలిక్, రెవిన్యూ అధికారి సీహెచ్ శ్రీనివాసరావు, అన్ని విభాగాల అధికారులు పాల్గొన్నారు.

## జిల్లా పోలీస్ పి జి ఆర్ ఎస్ లో 32 ఫిర్యాదులు



**రాజమహేంద్రవరం, పెన్ పవర్, ఆగస్టు 3:**రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న "ప్రజా సమస్యల పరిష్కార వేదిక "పబ్లిక్ గ్రీవెన్స్ రీడ్రసెల్ సిస్టం" కార్యక్రమాన్ని తూర్పుగోదావరి జిల్లా పోలీస్ కార్యాలయంలో జిల్లా సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ డి. నరసింహ కిషోర్ సోమవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో నిర్వహించారు. ప్రజల నుంచి వివిధ రకాల అర్జీలను స్వీకరించి సమస్యలు తెలు సుకుని, సంబంధిత స్టేషన్ పోలీసు అధికా రులతో ఫోన్లో మాట్లాడి ఫిర్యాది దారుల సమస్యలను చట్ట పరిధిలో , సత్వరమే న్యాయం చేయవల సినదిగా ఉత్తర్వులు ఇచ్చారు. పోలీసు "పబ్లిక్ గ్రీవెన్స్ రిడ్రసెల్ సిస్టం" లో 32 ఫిర్యాదులు స్వీకరించారు

## భవిత దివ్యాంగుల శిక్షణ కేంద్రం నకు కుర్చీలు బహుకరణ



**తాడేపల్లిగూడెం. పెన్ పవర్. ఆగస్టు 03.** తాడేపల్లిగూడెంమానవత స్వచ్ఛందసేవా సంస్థ అధ్యక్షులు కర్రీ రాజారావు ఆధ్వర్యంలో భవిత దివ్యాంగుల శిక్షణ కేంద్రమునకు మానవత సెక్రెటరీ బొడ్డు అరుణ సౌజన్యముతో పెద్ద కుమారుడు అరుణ్ కుమార్, కోడలు మల్లిక గార్ల పుట్టినరోజు సందర్భంగా 10 కుర్చీలు. ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు, భవిత విద్యార్థులకు, అంగనవాడి చిన్నారులకు బిస్కెట్స్. చాక్లెట్స్ .80 మంది పిల్లలకు

పంపిణీ చేసి వక్తలు మాట్లాడుతూ దివ్యాంగుల సేవా విశ్వ మానవ సేవ అని సమాజంలో ప్రతి ఒక్కరూ నార్మల్ పిల్లతో సమానంగా దివ్యాంగుల పిల్లలను ప్రోత్సహించి వారి విద్య అభివృద్ధికి సహాయ సహకారాలు అందించినట్లయితే ఇతరుల మీద ఆధారపడకుండా జీవించగలుగుతారని భవిష్యత్తులో మా మానవత స్వచ్ఛంద సేవా సంస్థ పిల్లల విద్య అభివృద్ధికి పూర్తి సహాయ సహకారాలు అందిస్తామని ఈరోజు పుట్టినరోజు వేడుకలు దివ్యాంగుల పిల్లల మధ్య నిర్వహించుకోవడం పిల్లలకు సేవా కార్యక్రమం నిర్వహించడం చాలా సంతోషకరమైన విషయమని ఆయురారోగ్యాలతో అష్టైశ్వర్యాలతో ఆ దేవుడు మరింత సేవా కార్యక్రమాలు నిర్వహించే శక్తిని ఆ దేవుడు కల్పించాలని జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. భవితా కేంద్రం ప్రత్యేక ఉపాధ్యాయులు ఎస్కే బాల ఈశ్వరయ్య ఎం చంద్ర కుమారి మానవతా స్వచ్ఛంద సంస్థ వారికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మానవత ప్రెసిడెంట్ కర్రి రాజారావు, సెక్రటరీ బొడ్డు అరుణ, నార్ని త్రిమూర్తులు, మిరియాల కిషోర్ కుమార్, డి. లక్ష్మి, వి. నాగరాజు, ఓలేటి పాండు రంగారావు, చేకూరి బంగార్రాజు, కంచర్ల నరసింహారావు, జినపనేని రాజేంద్రకుమార్, ఎర్ర ఆంజనేయ స్వామి, రాజేంద్ర ప్రసాద్, వీరబ్రహ్మం, నాయుడు, వాసాబక్తుల మోహన్, ప్రశాంతి, వీర బ్రహ్మం, రాజాబబయ్య,శ్రీ పాండురంగారావు ,బత్తుల ప్రసాద్, అంగన్వా టీచర్ సత్యవతి, పాఠశాల ప్రధానోపాధ్యాయులు కోటయ్య, పాఠశాల ఉపాధ్యాయులు రాంబాబు, తదితరులు పాల్గొన్నారు.

## 80వ స్వాతంత్ర్య దినోత్సవాలను జాతీయతా స్ఫూర్తి కలిగేలా నిర్వహించాలి



జిల్లా కలెక్టర్ కీర్తి చేకూరి

**రాజమహేంద్రవరం, పెన్ పవర్, ఆగస్టు 3 :**వచ్చే ఆగస్టు 15 న స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను, దేశభక్తి, జాతీయతా స్ఫూర్తి ఉట్టి పడేలా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ కీర్తి చేకూరి అధికారులను కోరారు.

సోమవారం కలెక్టరేట్ పిజిఆర్ఎస్ హాలులో ఆగస్టు 15వ తేదీన 80వ భారత స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల నిర్వహణకు చేపట్టవలసిన ఏర్పాట్లపై జిల్లా కలెక్టర్ వివిధ శాఖల అధికారులతో సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సంద ర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను స్థానిక ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాల మైదానంలో నిర్వహించాలని, వేడుకలకు ప్రభుత్వం డిజిగ్నేట్ చేసిన మంత్రి ముఖ్య అతిథిగా హాజరై జాతీయ పతావిష్కరణ చేసి జిల్లా ప్రజల నుద్దేశించి ప్రసంగిస్తారని తెలిపారు. ముఖ్య అతిథి సాంప్రదాయ కవాతు తిలకించి, గౌరవ వందన ఏర్పాట్లు పోలీస్ శాఖ చేపట్టాలని సూచించారు. వేదిక అలంకరణ, సాంప్రదాయ శకటాలు ప్రదర్శన, స్టాల్స్ ఏర్పాటు, విద్యార్థులతో సాంస్కృతిక కార్యక్రమాలు, విశిష్ట సేవలు అందించిన అధికారులు, సిబ్బందికి ప్రశంసా పురస్కారాల పంపిణీ అంశాలను ఏర్పాట్లు చేపట్టాలని జిల్లా కలెక్టర్ అధికారులకు ఆదేశించారు.? డిఆర్డిఏ, ఆర్ఎంసి, వ్యవసాయ, విద్య, వైద్యం, పౌర సరఫరాలు, పర్యాటక, అగ్నిమాపక శాఖలు శకటాలను ప్రదర్శించాలని, సంక్షేమ శాఖలు, మత్స్య, చేనేత, మైక్రో ఇరిగేషన్ శాఖలు స్టాళ్లు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. విద్యార్థులచే దేశభక్తి, జాతి సమైక్యత సందేశాల సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేయాలని విద్యాశాఖను ఆదేశించారు. జిల్లా ప్రగతి అంశాలను పొందుపరచి ముఖ్య అతిథి ప్రసంగాన్ని సిద్ధం చేయాలని సమాచార శాఖను ఆదేశించారు. వేడుకలకు హాజరయ్యే స్వాతంత్ర్య సమర యోధులు, వీఐపీలు, ప్రజాప్రతినిధులకు ఆతిథ్యం, ప్రజలు, విద్యార్థులకు తాగునీరు వైద్య శిబిరాలు, పారిశు ధ్య నిర్వహణ సక్రమంగా చూడాలని మున్సిపల్, రెవెన్యు అధికారులను ఆదేశించారు. అంతరా యాలు లేకుండా విద్యుత్ సరఫరా చేయాలని ఈపిడిసిఎల్ అధికారులకు సూచించారు.ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ వై.మేఘా స్వరూప్, మున్సిపల్ కమీషనర్ రాహుల్ మీనా, ఎఎస్పీ పాటిల్ దేవరాజ్ మనీష్, డిఆర్ఓ ఎస్. భాస్కరరెడ్డి, ఆర్డిఓ శివరాముడు, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

02
ఇప్పుడు పెన్ పవర్ దిన పత్రికలో
శుభాకాంక్షలు యాడ్స్
కేవలం
యాడ్ 300/-
'పోస్టుకార్డు సైజు '
'పో. 12 సెం.మీ, వె.16 సెం.మీ'
'మరిన్ని వివరాలకు సంప్రదించండి '
93948 55244
షరతులు వర్తిస్తాయి

## ఉత్తమ అధికారి రామ్ ప్రసాద్ : ఎమ్మెల్యే బొలిశెట్టి



**తాడేపల్లిగూడెం. పెన్ పవర్. జులై 31.**స్వర్ణ తాడేపల్లిగూడెం పెంటపాడు ప్రభుత్వ లక్ష్యాలను నెరవేర్చటంలో ప్రభుత్వ అధికారులపాత్ర ఎంతో కీలకమైందని,రాంప్రసాద్ వంటి ఉత్తమ అధికారులను ప్రభుత్వ ఉద్యోగులు ఆదర్శంగా తీసుకోవాలని శాసనసభ్యులు, రాష్ట్ర ప్రభుత్వ విప్ బొలిశెట్టి శ్రీనివాస్ అన్నారు. తాడేపల్లిగూడెం నియోజకవర్గం, పెంటపాడు మండల పరిషత్ అభివృద్ధి అధికారి పెద్దిరెడ్డి వి.వి.ఎస్ రామ్ ప్రసాద్ పదవీ విరమణ సన్మాన కార్యక్రమం లో ఎంపీపీ కట్టు బోయిన వెంకటలక్ష్మి అధ్యక్షతన శుక్రవారం పెంటపాడు మండల పరిషత్ కార్యాలయంలో జరిగింది. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎంతో సహనంతో, సమర్ధవంతంగా ఉద్యోగ బాధ్యతలు నిర్వర్తించి, ప్రజల అభిమానం పొందారని అన్నారు. రామ్ ప్రసాద్ దంపతులకు సన్మానం చేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ అధికారులు, మాజీ సర్పంచులు, ఎంపీటీసీలు కూటమి నాయకులు పాల్గొన్నారు.

## ఆగస్టు 1 నుంచి 7 వ వరకు ప్రపంచ తల్లిపాల వారోత్సవములు కార్యక్రమం






**తాడేపల్లిగూడెం. పెన్ పవర్. ఆగస్టు 03**:ఆగస్టు 1 వ తేదీ నుంచి 7 వ తేది వరకు ప్రపంచ తల్లిపాల వారోత్సవములు కార్యక్రమం నిర్వహించడం జరుగుతుంది అని కార్యక్రమంలో భాగంగా ఈరోజు తాడేపల్లిగూడెం మున్సిపల్ ఆఫీస్ మరియు ఆర్ డి ఓ ఆఫీస్ లలో తల్లిపాల వారోత్సవాలకు సంబంధించిన పోస్టర్లను ఆవిష్కరించడం జరిగింది అలాగే తల్లిపాల ప్రాముఖ్యత గురించి వివరించడం జరిగింది అన్నారు. ఈ కార్యక్రమం రేపటి నుంచి అన్ని అంగన్వాడి కేంద్రాల్లో నిర్వహించి తల్లులకు తల్లిపాల యొక్క ప్రాముఖ్యతపై అవగాహన కల్పించడం జరుగుతుంది అని తెలియజేయడమైనది. ఈ కార్యక్రమంలో తాడేపల్లిగూడెం ఆర్డీవోఎం సూర్య రావు , మున్సిపల్ కమిషనర్ ఎం ఏసు బాబు, సిడిపిఓ టి యల్ సరస్వతి అందరు డివిజనల్ అధికారులు మరియు మున్సిపల్ సెక్షన్ హెడ్స్ ఐసీడీస్ సూపర్వైజర్స్ సిహెచ్ దుర్గ భవాని, కె విశాలాక్షి హాజరైనారు

## స్థానిక ఎన్నికలకు సన్నద్ధం కావాలి - ఏ ఒక్క ఓటు పొల్లు పోనీయొద్దు - బిజెపి నేతల పిలుపు






**తాడేపల్లిగూడెం పెన్ పవర్. ఆగస్టు 03** :స్థానిక సంస్థల ఎన్నికలకు బిజెపి నేతలు కార్యకర్తలు సన్నద్ధం కావాలని, ఓటర్ల జాబితాలో అర్హులైన వారే ఏ ఒక్క ఓటు పొల్లు పోనీయకుండా జాగ్రత్త వహించాలని బిజెపి రాష్ట్ర జిల్లా నాయకులు పిలుపునిచ్చారు. భారతీయ జనతా పార్టీ తాడేపల్లిగూడెం పట్టణ కార్యాలయంలో సోమవారం జరిగిన నెలవారి సమావేశానికి బిజెపి పట్టణ అధ్యక్షులు దువ్వా శ్రీనివాస్ అధ్యక్షత వహించారు. బిజెపి జిల్లా ఇన్ ఛార్జి రేలంగి శ్రీదేవి మాట్లాడుతూ త్వరలో జరగనున్న మున్సిపల్ పంచాయతీ స్థానిక సంస్థలు ఎన్నికలకు సన్నద్ధం కావాలని సూచించారు. ఇందుకు అనుగుణంగా ఓటర్ల జాబితాలో సమగ్ర సవరణ నమోదు కార్యక్రమశీ రెండో దశలో ముసాయిదా ఓటర్ల జాబితాలను పరిశీలించి అర్హులైన వారి పేర్లను పరిశీలించి, లేకుంటే వాటిని తిరిగి నమోదు చేసేలా చేయాలని కోరారు. బిజెపి నాయకులు కార్యకర్తలు సమైక్యంగా కృషిచేసి మరింత బలోపేతం చేయాలన్నారు. బిజెపి జిల్లా అధ్యక్షురాలు అయినశీపూడి శ్రీదేవి మాట్లాడుతూ సంస్థాపరంగా పార్టీని మరో అంత బలోపేతం చేసేందుకు కృషి చేయాలని కోరారు. ముసాయిదా ఓటర్ల జాబితాలతో ప్రతి ఇంటిని సందర్శించి అర్హులైన వారి ఓట్లు గల్లంత కాకుండా జాగ్రత్త వహించాలన్నారు. చనిపోయిన వారు స్థానికంగా నివాసం లేనివారే పేర్లు జాబితాలో ఉంటే అభ్యంతరం తెలుపుతూ వాటిని తొలగించేందుకు చర్యలు తీసుకొనేల అధికారుల దృష్టికి వెళ్ళాలన్నారు. శక్తి కేంద్రాల ఇన్చార్జిల నియామకాలు సత్వరం పూర్తిచేసి బూత్ స్థాయిలో కార్యక్రమాలు నిర్వహించాలని, నరేంద్ర మోడీ ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలు ప్రజల దృష్టి తీసుకువెళ్లాలని కోరారు. బిజెపి రాష్ట్ర కార్యదర్శి భోగి రెడ్డి ఆదిలక్ష్మి మాట్లాడుతూ రాష్ట్ర పార్టీ ఆదేశాల మేరకు పోలింగ్ బూత్, శక్తి కేంద్రాలు స్థాయిలో పార్టీని మరింత పటిష్టం చేసేందుకు సమన్వయంగా కృషి చేయాలని సూచించారు. బిజెపి నియోజకవర్గ ఇన్చార్జి ఈతకోట తాతాజీ మాట్లాడుతూ రానున్న స్థానిక సంస్థల ఎన్నికల దృష్టిలో ఉంచుకొని నరేంద్ర మోడీ ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలు ప్రజలకు తెలియ చెప్పాలని కోరారు. ప్రజలకు మరింత చేరువయ్యేలా క్షేత్రస్థాయిలో కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో బిజెపి యువ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షురాలు సింధు పైడికొండల, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కోట రాంబాబు, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు కంచుమర్తి నాగేశ్వరరావు, జాతీయ కౌన్సిల్ మాజీ సభ్యులు కర్రి ప్రభాకర్ బాలాజీ, గట్టిశీ మాణిక్యాలరావు, పట్టణ అధ్యక్షులు దువ్వా శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి చిట్యాల రాంబాబు,కావ్యరెడ్డి, కసిరెడ్డి నాగదుర్గ, మహిళమోర్చ పట్టణ అధ్యక్షురాలు గోకా మహాలక్ష్మి, ప్రధాన కార్యదర్శి సన్నిధి నా గదుర్గ,రాష్ట్ర కౌన్సిల్ మాజీ సభ్యులు అడపా రమేష్, బి ఎల్ ఏ-1 పాటే నాగేశ్వర రావు, ముప్పిడి సురేష్ రెడ్డి,ఎస్వి రంగారావు, పదాధికారులు పాల్గొన్నారు.

## యువ క్రికెటర్‌కు రూ.1.50 లక్షల ఆర్థిక సహాయం

**రాజమహేంద్రవరం, పెన్ పవర్, ఆగస్టు 3:**స్థానిక 42వ డివిజన్ లలితా నగర్ 5వ అడ్డ వీధికి చెందిన యువ క్రికెటర్ సొంటి విజయ శ్రీ హన్సికకు భవాని చారిటబుల్ ట్రస్ట్, పలువురు సహకారంతో సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ రూ. 1.50 లక్షలు ఆర్థిక సహాయం అందించారు.ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి రూ 35 వేలు మంజూరు చేయించారు. హన్సిక చిన్నప్పటి నుంచే క్రికెట్ లో ప్రతిభ కనబరుస్తున్న సమయంలో అకస్మాత్తు గా రెండు కాళ్లు పనిచే యకుండా పోవడంతో తీవ్ర అనారోగ్యానికి గురైంది. ప్రస్తుతం ఆమె హైదరాబాద్‌లోని నిమ్స్ ఆసుపత్రిలో నిపుణుల పర్యవేక్షణలో చికిత్స పొందుతోంది. వైద్యులు సూచించిన ప్రత్యేక చికిత్సకు భారీగా ఖర్చు అవుతుండటంతో ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ దృష్టికి వెళ్లడంతో ఆయన స్పందించి ఆర్థిక సహాయం సమకూరేలా చర్యలు తీసుకున్నారు. తమ కు అండగా నిలిచిన ముఖ్యమంత్రి, ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్‌కు కృతజ్ఞతలు తెలిపారు.



## కూటమి ప్రభుత్వం ప్రజలను, విద్యార్థులను, యువతను దారుణంగా మోసం చేస్తుంది.





- నారా లోకేష్ కు విద్యాశాఖ మంత్రిగా ఉండే నైతిక హక్కు లేదు.
- వడ్డి రఘురామ్ నాయుడు

**తాడేపల్లిగూడెం. పెన్ పవర్. ఆగస్టు 3:**పశ్చిమగోదావరి జిల్లా తాడేపల్లిగూడెం పట్టణంలోని రేణుక ఫంక్షన్ హాల్లో నియోజకవర్గ స్థాయి టౌన్ హాల్ మీటింగ్ నిర్వహించారు. తాడేపల్లిగూడెం నియోజకవర్గ వైసీపీ ఇంచార్జి వడ్డి రఘురామ్ నాయుడు ఆధ్వర్యంలో నియోజకవర్గ స్థాయి టౌన్ హాల్ మీటింగ్ పెద్దఎత్తున జరిగింది. ఈ సందర్భంగా పలు విద్యార్థి సంఘాల నాయకులు, మేధావులు, వైఎస్సార్ సీపీ మరియు ప్రజా సంఘాల నాయకులు సమావేశంలో పాల్గొని డీఎస్సీలో జరిగిన అక్రమాలపై సీబీఐ ఎంక్వైరీ కావాలని, కారకుడైన విద్యాశాఖ మంత్రి లోకేష్ రాజీనామా చేయాలని, ఫీజు రీయింబర్స్మెంట్ బకాయిలు విడుదల చేయాలని, నిరుద్యోగ భృతి 3000 వెంటనే ఇవ్వాలని డిమాండ్ చేస్తూ వారివారి అభిప్రాయాలను తెలియచేసారు.

ఈ సందర్భంగా వడ్డి రఘురామ్ నాయుడు మాట్లాడుతూ ఈ కూటమి ప్రభుత్వం ప్రజలను విద్యార్థులను యువతను దారుణంగా మోసం చేస్తుందన్నారు. నారా లోకేష్ విద్యాశాఖమంత్రిగా ఉండే నైతిక హక్కు లేదన్నారు. డీఎస్సీ లో అవకతవకలు జరిగాయని తెలిసి కూడా ఎందుకు సీబీఐ ఎంక్వయిరీ వేయట్లేదని మండిపడ్డారు. మెరిట్ ను పక్కనపెట్టి స్పోర్ట్స్ కోటా ద్వారా వారికి కావాల్సిన వారికి ఉద్యోగాలు ఇచ్చారని దుయ్యబట్టారు.

తల్లికివందనం పేరుమీద ప్రతీ విద్యార్థికి 15వేలు అందిస్తామని పలు కారణాలతో ఎంత మందిని మినహాయించి ఎగ్గొట్టారో ప్రజలకి చెప్పాలన్నారు.

నిరుద్యోగులకు ఉపాధి కలిగే వరకు ఇస్తానన్న నిరుద్యోగ భృతి ఎందుకు ఇప్పటి వరకు ఇవ్వలేదని ప్రశ్నించారు. కల్లబొల్లి మాటలు చెప్పి అధికారంలోకి వచ్చిన ఈ కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలు వెంటనే అమలు చేయలన్నారు. అప్పటివరకు ఈ ప్రభుత్వం మెడలు వంచే కార్యక్రమం వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ తరపున చేస్తామన్నారు.



## మార్కెట్ ధర కంటే రూ.10 తక్కువకే బియ్యం:ఎమ్మెల్యే బొలిశెట్టి







### వై.సి.పి. ప్రజల పట్ల బాధ్యతగా వ్యవహారించాలని ఎమ్మెల్యే సూచన

**తాడేపల్లిగూడెం,పెన్ పవర్. ఆగస్టు 03:**

రాష్ట్ర ప్రభుత్వం ప్రజలకు మార్కెట్ ధర కంటే కిలోకు రూ.10 తక్కువ ధరలో నాణ్యమైన బియ్యం అందించే కార్యక్రమాన్ని చేపట్టిందని తాడేపల్లిగూడెం శాసన సభ్యులు, రాష్ట్ర ప్రభుత్వ విప్ బొలిశెట్టి శ్రీనివాస్ తెలిపారు. స్థానిక చాంబర్ ఆఫ్ కామర్స్, రైస్ మిల్లర్స్ అసోసియేషన్ భవనాలలో పౌర సరఫరాల శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన బియ్యం విక్రయ కేంద్రాలను సోమవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం సబ్సిడీ భరిస్తూ రాష్ట్రవ్యాప్తంగా బియ్యం విక్రయ కేంద్రాలను ఏర్పాటు చేసిందన్నారు. ఈ పథకాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

రాష్ట్రవ్యాప్తంగా 500 రైస్ మిల్ పాయింట్లు, 115 రైతు బజార్ల ద్వారా బియ్యం విక్రయాలు జరుగుతున్నాయని చెప్పారు. తాడేపల్లిగూడెం రైతు బజార్‌ను పునరుద్ధరించి మరింత సమర్థవంతంగా వినియోగించేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించినట్లు తెలిపారు.

రేషన్ కార్డు కలిగిన కుటుంబాలకు తక్కువ ధరకు బియ్యం అందించే బాధ్యతను ప్రభుత్వం తీసుకుందని పేర్కొన్నారు. రైతుల నుంచి నేరుగా నాణ్యమైన బియ్యం కొనుగోలు చేసి తక్కువ ధరకు ప్రజలకు అందిస్తుందని తెలిపారు. రైతుల నుంచి ధాన్యం కొనుగోలు, పీడీఎస్ ద్వారా పంపిణీ వంటి అంశాల్లో ప్రభుత్వం పారదర్శకంగా వ్యవహరిస్తుందని అన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి, కొణిదెల పవన్ కళ్యాణ్ ల నాయకత్వంలో ప్రభుత్వం ప్రజలకు మేలు చేసే నిర్ణయాలు తీసుకుంటున్నారని అన్నారు. వైసిపి నాయకులు ప్రజా సంక్షేమ కార్యక్రమాలను విమర్శించడం కంటే నిర్మాణాత్మక పాత్ర పోషించాలని సూచించారు. గత ప్రభుత్వంలో డీఎస్సీ ద్వారా ఉద్యోగాలు ఇవ్వలేదని, ప్రస్తుత ప్రభుత్వం 16,500 ఉద్యోగాలు భర్తీ చేసిందని పేర్కొన్నారు. త్వరలో మరో డీఎస్సీ ద్వారా మరిన్ని ఉద్యోగాలు భర్తీ చేయనున్నట్లు తెలిపారు. భోగాపురం విమానాశ్రయం, పోలవరం ప్రాజెక్టు, అమరావతి అభివృద్ధి వంటి హామీల అమలుకు ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. రాష్ట్రానికి పెట్టుబడులు తీసుకువచ్చి పరిశ్రమల స్థాపనకు అనుకూల వాతావరణం కల్పిస్తున్నామని, తద్వారా యువతకు ఉపాధి అవకాశాలు పెరుగుతాయని చెప్పారు. కూటమి ప్రభుత్వం సంక్షేమంతో పాటు అభివృద్ధికి సమాన ప్రాధాన్యం ఇస్తోందని తెలిపారు. ప్రజలను తప్పుదోవ పట్టించే వైసిపి రాజకీయాలు సరికాదని అన్నారు. చట్టవిరుద్ధ కార్యకలాపాలపై ప్రభుత్వం కఠినంగా వ్యవహరిస్తోందని, నేరస్తులకు మద్దతు ఇవ్వడం సమాజానికి మంచిది కాదని అన్నారు. ప్రతిపక్షం అసెంబ్లీకి వచ్చి ప్రజా సమస్యలపై చర్చించాలని, రాష్ట్ర అభివృద్ధి కి సహకరించాలని కోరారు. ఎవరికయినా 40 ఏళ్లకే

వయసైపోతుంది అని చెపుతున్న జగన్, 50 ఏళ్లు దాటినా రాజకీయాలలో ఎందుకు కొనసాగుతున్నారని ఎద్దేవా చేశారు. తెలివి తక్కువగా, హద్దులు దాటి మాట్లాడడం సరికాదన్నారు. మరణించిన వారి కుటుంబాన్ని పరామర్శించడం సహజమని, జైలులో ఉన్నవారిని పరామర్శించడం ఏ సంస్కృతి అని ప్రశ్నించారు.

రౌడీషీటర్లకు మద్దతుగా మాట్లాడడం, కులాల పేరుతో ఉద్రిక్తతలు సృష్టించడం తగదన్నారు. అలాంటి వ్యాఖ్యలపై ప్రభుత్వం చట్టపరమైన చర్యలు తీసుకుందని, అధికారులపైనా చర్యలు తీసుకున్నట్లు పేర్కొన్నారు. సి.ఐ. సస్పెన్షన్ అంశాన్ని వక్రీకరించి ప్రభుత్వంపై బురదజల్లే ప్రయత్నాలు జరుగుతున్నాయని ఆరోపించారు. మంచి వ్యక్తికి అన్యాయం జరిగితే అందరూ స్పందించాలని, సమాజానికి హాని చేసే వ్యక్తులకు మద్దతుగా ఉండటం అవసరం లేదన్నారు.

ఉత్తరప్రదేశ్‌లోప్రభుత్వం రౌడీషీటర్లపై కఠిన చర్యలు తీసుకున్నప్పటికీ ఎవరూ ప్రశ్నించలేదని అన్నారు.

రాష్ట్రంలో వైసిపి నేతలు మాత్రం రౌడీషీటర్లకు మద్దతు ఇస్తున్నారని విమర్శించారు.

ప్రతిపక్షం అసెంబ్లీకి రాకుండా తన బాధ్యతను విస్మరిస్తోందని ఆరోపించారు.ప్రజా సమస్యలపై చర్చించకుండా జగన్ సొంత పత్రికల్లో వచ్చిన కథనాల ఆధారంగా విమర్శలు చేయడమే వైసిపి నేతల పనిగా మారిందని విమర్శించారు. ఈ కార్యక్రమాల్లో బిజెపి ఇంచార్జ్, చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షులు ఈత కోట తాతాజీ, తహశీల్దార్ సునీల్ కుమార్, రైస్ మిల్లర్స్ అసోసియేషన్ అధ్యక్షులు వెంకన్న బాబు, పలువురు రైస్ మిల్లర్లు,రైస్ ట్రేడర్లు తదితరులు పాల్గొన్నారు.

## శ్రీరామగిరి గ్రామానికి సహాయం శూన్యం

### -ఏం..ఇచ్చారు.. వచ్చేనెల బియ్యం..ఈ నెల ఇస్తే సహాయమా..?

**వి.ఆర్.పురం**

**పెన్.పవర్.ఆగస్టు. 3:**గోదారివరదలుఉగ్రరూపం,దాల్చి,చివరక ుశాంతి ఇవ్వడంతోప్రభుత్వంవరదభాదితులకుచేసేసహా యంప్రారంభయ్యాయని,పలువురుఆరోపిస్తున్నారు. పూర్తిగామునిగిన,శ్రీరామగిరి గ్రామానికి ఎటువంటి సహాయంఅందలేదని,గ్రామస్తులుఆవేదనవ్యక్తంచే శారు.అందుబాటులోఉన్న గ్రామాలలో,నిత్యావసర సామానుపంపిణీ చేసిన అధికారులు శ్రీరామగిరి కి ఎటువంటి సహాయంచేయలేదని,అక్కడవరదబాధి తులువాపోయారు.కొండలు(గుట్టలు)మీదఉన్నమాకు కనీసంకిరోసిన్,కొవ్వొత్తులుగానిఇవ్వలేదని,చీక ట్లోబిక్కుబిక్కుమంటూగడుపుతున్నామని,గ్రామ స్తులువెంకటేశ్వర్లుఅన్నారు.కనీసంబియ్యంకూడ ఇవ్వలేదని,తెలిపారుఒక్కసారి సహాయకార్యక్రమా లుచూద్దాం1.రెండు నెలలుబియ్యం ఒకేసారి ఇస్తు న్నారు.వచ్చేనెలఇవ్వరు2.పంచాయతీల్లోఉన్న బ్లీచింగ్ పౌడర్,నుగ్రామాలలోరహదారులపైన,జల్లుతున్నారు. 3.కూనవరంలో రెండురోజుల నుండి ఆహారంసరఫరా చేస్తున్నారట.?4.ఎప్పుడువర్షాకాలంలోఇచ్చేదోమ



తెరలుపంచారు.అందరికి కాదం డోయ్..?ఇవి కూడా గృహాలుమునిగిన వారికే,మునగని వారికీ డెంగ్యూ. మలేరియా లాంటివివస్తే ఇస్తారనుకుంటా..? 5.ఎప్పుడు చెప్పేమాటే అందరికి సహాయం చేస్తాం ఎవ్వరు భయ పడవద్దు.6వ.సహాయంగత సంవత్సరం వరద సహా యంఇస్తామని,చెపుతున్నారు.ఈ సహాయం వచ్చే సంవత్సరంమళ్ళీ వరదలకు ఇస్తారెమో?బాధితులకు ఖర్చు పెట్టిన సొమ్ము కన్నా అధికారులు తిరిగిన వాటికే అధిక ఖర్చు జరిగినట్టు గుసగుసలు వినిపిస్తున్నాయి. స్థానిక యంత్రాంగం పై భాధితులు చాలాఅసంతృప్తిగా ఉన్నారు.రేపువచ్చే పంచాయతీ ఎలక్షన్స్,లోబాధితు లకుఎంత సహాయం చేసారో ప్రజలు వేసిన ఓటు ద్వారాఅంద రికి తెలుస్తుంది.పడవలు పెట్టింది. కూడాఎక్కువ ఎవరు ఉపయోగించుకున్నారో, చూసినవారికితెలుస్తుందని,పలువురుఆరోపిస్తున్నారు

## సాంఘిక సంక్షేమ బాలుర హాస్టల్ వార్డెన్‌ను సస్పెండ్ చేయాలి

### పి జి ఆర్ ఎస్ లో అంబేద్కర్ స్టూడెంట్ ఫెడరేషన్ అర్జీ



**రాజమహేంద్రవరం, పెన్ పవర్, ఆగస్టు 3:**స్థానిక సాంఘిక సంక్షేమ బాలుర హాస్టల్‌లో గత నెల 20న హాస్టల్ లో విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలు, వార్డెన్ నిర్లక్ష్యం, విద్యార్థుల భద్రతకు సంబంధించిన అంశాలపై పి జీ ఆర్ ఎస్ లో ఫిర్యాదు చేయడం జరిగింది. అయితే, ఆ ఫిర్యాదుపై జిల్లా సాంఘిక సంక్షేమ అధికారి సమగ్ర విచారణ నిర్వహించకుండా, ఏకపక్షంగా నివేదికను సమర్పించి వార్డెన్‌ను కాపాడే ప్రయత్నం చేశారని అంబేద్కర్ స్టూడెంట్ ఫెడరేషన్ నాయకులుఆరోపించారుఈ నేపథ్యంలో సోమవారం తూర్పు గోదావరి జిల్లా జాయింట్ కలెక్టర్ ని కలిసి అంబేద్కర్ స్టూడెంట్ ఫెడరేషన్ ప్రతినిధులు మరోసారి వినతిపత్రం సమర్పించారు.అనంతరం అంబేద్కర్ స్టూడెంట్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షులు తాడేపల్లి విజయ్ కుమార్ మాట్లాడుతూ, గతంలో ఇదే హాస్టల్‌లో ఒక మైనర్ అమ్మాయి అత్యాచా రానికి గురి అయితే ఆ విషయంలో సస్పెండ్ అయిన తరువాత కూడా తిరిగి అదే హాస్టల్‌లో వార్డెన్ విధుల్లో నియమించడం నిర్లక్ష్యా నికి నిదర్శనమని పేర్కొన్నారు. సంక్షేమ శాఖ అధికారికి ఇదే హాస్టల్ లో పోస్టింగ్ ఇవ్వడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించా రు. గతంలో వార్డెన్‌పై చర్యలు తీసుకున్న ప్పటికీ, తిరిగి అదే హాస్టల్‌లో విధుల్లో నియమించడం వలన మరో మైనర్ విద్యార్థిని కనిపించకుండా పోయిన సంఘటన చోటుచేసు కోవడం ఆందోళన కరమైన విషయ మన్నారు. ఇలాంటి నిర్లక్ష్య నిర్ణయాల వల్ల విద్యార్థుల భద్రతకు ముప్పు ఏర్పడి, ఇటువంటి ఘటనలు పునరావృతమవుతున్నాయని ఫెడరేషన్ ఆవేదన వ్యక్తం చేసింది. తమ ఫిర్యాదుపై అధికారులు నిష్పక్షపాతంగా విచారణ చేయకుండా తప్పుడు నివేదిక సమర్పించడం దురదృష్టకరమన్నారు. ఈసారి జాయింట్ కలెక్టర్ స్వయంగా సమగ్ర విచారణ జరిపి, సంబంధిత వార్డెన్‌తో పాటు విధి నిర్వహణలో నిర్లక్ష్యం వహించిన జిల్లా సాంఘిక సంక్షేమ అధికారిపై కూడా కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

ఈ ఫిర్యాదుపై కూడా నిష్పక్షపాత విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోకపోతే, ముఖ్యమంత్రి కార్యాలయం గ్రీవెన్స్‌కు ఫిర్యాదు చేయడంతో పాటు అంబేద్కర్ స్టూడెంట్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ప్రజా స్వామ్య ఆందో ళనలు చేపడ తామని హెచ్చరించారు.

ఈ కార్యక్రమంలో అంబేద్కర్ స్టూడెంట్ ఫెడరేషన్ విద్యార్థి నాయకులు భీమ్ చంద్ర, హర్ష, వికాస్, జన దుర్గ, దారా అశోక పాల్గొన్నారు

## రాజవోలు గ్రామంలో ఇంటింటికి ఎమ్మెల్యే గోరంట్ల



**రాజమహేంద్రవరం, పెన్ పవర్, ఆగస్టు 3**

కూటమి ప్రభుత్వం రాష్ట్రవ్యాప్తంగా త్వరలో రెండు లక్షల నూతన పింఛన్లు మంజూరు చేయనుందని రూరల్ శాసనసభ్యులు గోరంట్ల బుచ్చయ్య చౌదరి అన్నారు. రూరల్ మండలం రాజవోలు గ్రామంలో "రెండేళ్ల నమ్మకంఅభివృద్ధి-సంక్షేమం" ఇంటింటి కార్యక్రమంలో ఎమ్మెల్యే గోరంట్ల పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గోరంట్ల మాట్లాడుతూ ప్రజల్లో ఎక్కువ మంది హౌసింగ్ సమస్య చెబుతున్నారని, గత ఇళ్లకు డబ్బులు చెల్లించాల్సి ఉందని, త్వరలోనే హౌసింగ్ సమస్యలు పరిష్కరిస్తామని తెలిపారు. రాజవోలు గ్రామంలో నూతన తెలుగుదేశం పార్టీ కార్యాలయాన్ని ప్రారంభించారు. ఎన్ టి ఆర్ విగ్రహాన్ని ప్రతి గ్రామంలోనూ ఏర్పాటు చేయుటకు గ్రామానికి 50వేల రూపాయలు తన సొంత నిధులు కేటాయి స్తానని తెలిపారు. అనంతరం ఇంటింటికి వెళ్లి కూటమి ప్రభుత్వ విజయాలు కరపత్రాలను పంపిణీ చేశారు.

ఈ కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ మార్ని వాసుదేవ్, రూరల్ మండల తెదేపా అధ్యక్షులు మత్స్యేటి ప్రసాద్, గ్రామ పార్టీ అధ్యక్షులు నిమ్మలపూడి రామకృష్ణ, వల్లూరి చెంచురాజు, మద్దా మణి, పిల్ల తనుజ, చేపల వెంకట్రావు, గాలి వెంకటేశ్వరరావు, వల్లూరి శ్రీరామ చౌదరి, దుద్దుపూడి రమేష్, బొప్పన నానాజీ, అంగర రాజు, సువర్ణకుమారి, , తదితరులు పాల్గొన్నారు

## శ్రీ స్వామివారి హుండీ లెక్కింపు: రూ.2.81 కోట్ల ఆదాయం



**పెన్ పవర్ -- ద్వారకాతిరుమల, ఆగస్టు 03:**ప్రముఖ పుణ్యక్షేత్రమైన ద్వారకాతిరుమల శ్రీ వేంకటేశ్వరస్వామివారి ఆలయంలో సోమవారం ప్రమోద మండపంలో హుండీ లెక్కింపు కార్యక్రమాన్ని అత్యంత భద్రతా ఏర్పాట్ల మధ్య నిర్వహించారు. ఆలయ అధికారులు ఉదయం హుండీలను తెరిచి లెక్కింపు చేపట్టారు.

గత 25 రోజుల కాలానికి సంబంధించిన హుండీ ఆదాయంగా రూ.2.81 కోట్ల నగదు లభించినట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి వేంద్ర త్రినాథరావు తెలిపారు. అదనంగా 245 గ్రాముల బంగారం, 3 కిలోల 330 గ్రాముల వెండి, అలాగే పలు దేశాలకు చెందిన విదేశీ కరెన్సీ భక్తులు సమర్పించినట్లు వెల్లడించారు.

ఈ హుండీ లెక్కింపు కార్యక్రమంలో ఆలయ అధికారులు, సిబ్బంది, భద్రతా సిబ్బంది పాల్గొన్నారు.

Printed by Published by GANTYADA APPARAO on behalf of GANTYADA APPARAO, printed at printed at SRI SAI GANGA PRINTERS AND PUBLISHERS FLAT NO: 504, Bharat Towers, 5th lane, Dwaraka Nagar, Visakhaptanam, Andhrapradesh-530016, and published at Flat No F2, Nihar towers, Srinagar, kakinada, kakinada District, Andhrapradesh -533003 Editor: GANTYADA APPARAO. Mobile : 9059465965, RNI : APTEL/2017/73154 , editorpenpower@gmail.com

## సమీక్షలు వద్దు-క్షేత్రంలోకి రండి...



**కూనవరం, పెన్ పవర్, ఆగస్టు3.**గోదావరి వరదలపై అధికారులు సమీక్షలతో సరిపెట్టకుండా క్షేత్ర స్థాయిలో పర్యటించి బాధితులకు న్యాయం చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వి వెంకటేశ్వర్లు,రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షులు కృష్ణయ్య డిమాండ్ చేశారు.కూనవరం మండలం శబరి కొత్తగూడెం గ్రామంలో పర్యటించిన వారు,వరదల సమయంలో ఒక్క అధికారి కూడా రాలేదని,ముందస్తు చర్యలు తీసుకోలేదని బాధితులు ఆవేదన వ్యక్తం చేశారని తెలిపారు.వరద బాధితులకు 10 వేలు తక్షణ సాయం,3నెలల రేషన్,14 రకాల నిత్యావసరాలు ఇవ్వాలని కోరారు.

ఈ కార్యక్రమంలో బొప్పెన కిరణ్,మేకల నాగేశ్వరావు, బాబు బొర్రయ్య తదితరులు పాల్గొన్నారు.

## ఎల్‌నినో పరిస్థితుల్లో వరికి వెదజల్లే సాగు ఉత్తమ ప్రత్యామ్నాయం

- రైతులు డైరెక్ట్ సోయింగ్ విధానాన్ని అనుసరించాలి
- మండల వ్యవసాయ అధికారి కె. విశ్వనాథ్



**గంగవరం, పెన్ పవర్, ఆగస్టు 3:**ప్రస్తుత ఎల్‌నినో పరిస్థితులు, తక్కువ వర్షపాతం, నీటి లభ్యత తగ్గుతున్న నేపథ్యంలో వరి సాగులో డైరెక్ట్ సోయింగ్ (వెదజల్లే పద్ధతి) రైతులకు ఉత్తమ ప్రత్యామ్నాయమని మండల వ్యవసాయ అధికారి కె. విశ్వనాథ్ సూచించారు. నీటిని ఆదా చేయడంతో పాటు సాగు వ్యయాన్ని తగ్గించి, మంచి దిగుబడులు సాధించేందుకు ఈ పద్ధతి ఉపయోగపడుతుందని తెలిపారు.వ్యవసాయ అధికారి మాట్లాడుతూ, డైరెక్ట్ సోయింగ్ విధానంలో నారు పెంపకం, నాట్లు అవసరం ఉండవని, దీంతో కూలీల ఖర్చు 30 నుంచి 40 శాతం వరకు తగ్గుతుందని చెప్పారు. అలాగే 15 నుంచి 20 శాతం వరకు నీటి వినియోగం తగ్గడంతో పాటు, పంట త్వరగా స్థిరపడి సమయానికి విత్తడం వల్ల దిగుబడి అవకాశాలు మెరుగుపడతాయని వివరించారు. యంత్రాల సహాయంతో విత్తనాలు వేయడం కూడా సులభమవుతుందని పేర్కొన్నారు.ఎకరానికి సాధారణంగా 20--25 కిలోల విత్తనం, డ్రిల్ ద్వారా విత్తితే 15--20 కిలోలు, వెదజల్లే పద్ధతిలో 25--30 కిలోల విత్తనం ఉపయోగించాలని సూచించారు.రైతులు ఈ పద్ధతి అనుసరించే ముందు నేలలో తగిన తేమ ఉండేలా చూసుకోవాలని, అధిక మొలక శాతం కలిగిన నాణ్యమైన విత్తనాన్ని మాత్రమే ఉపయోగించాలని తెలిపారు. విత్తన శుద్ధి తప్పనిసరిగా చేయాలని, పొలాన్ని సమతలంగా సిద్ధం చేయాలని, ప్రారంభ దశలో కలుపు నివారణ చర్యలు చేపట్టాలని సూచించారు. అవసరమైనప్పుడు తేలికపాటి నీటి పారుదల అందించడంతో పాటు, మట్టి పరీక్షల ఆధారంగా ఎరువులు వేయాలని, చీడపీడలు, తెగుళ్లను ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ సకాలంలో నివారణ చర్యలు చేపట్టాలని రైతులకు సూచించారు.వర్షాలు ఆలస్యంగా ప్రారంభమయ్యే పరిస్థితుల్లో, నీటి కొరత ఉన్న ప్రాంతాల్లో, కూలీల కొరత ఎదురయ్యే ప్రాంతాల్లో, తేలికపాటి నుంచి మధ్యస్థ నేలల్లో డైరెక్ట్ సోయింగ్ పద్ధతి మంచి ఫలితాలను ఇస్తుందని మండల వ్యవసాయ అధికారి కె. విశ్వనాథ్ తెలిపారు. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని శాస్త్రీయ పద్ధతుల్లో వరి సాగు చేపట్టాలని ఆయన పిలుపునిచ్చారు.

# తల్లిపాలే శిశువుకు తొలి రక్షణ కవచం



**గంగవరం, పెన్ పవర్, ఆగస్టు 3:** ప్రపంచ తల్లిపాల వారోత్సవాల సందర్భంగా గంగవరం ప్రాజెక్టు పరిధిలోని గంగవరం సెక్టార్ శరభవరం అంగన్వాడీ కేంద్రంలో సోమవారం అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సీడీపీఓ వి. సుచరిత ఆదిలక్ష్మి అధ్యక్షత వహించారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, శిశువు జన్మించిన వెంటనే తల్లిపాలు పట్టించడం అత్యంత అవసరమని తెలిపారు. పుట్టిన వెంటనే వచ్చే ముర్రుపాలు (కొలస్ట్రం) శిశువుకు అమూల్యమైన పోషకాహారమని, వాటిలో ఉండే విటమిన్--ఏతో పాటు వ్యాధి నిరోధక శక్తిని పెంచే పోషకాలు బిడ్డను అనేక వ్యాధుల నుంచి రక్షిస్తాయని వివరించారు. సాధారణ ప్రసవమైనా, శస్త్రచికిత్స ద్వారా ప్రసవమైనా ప్రతి తల్లి తప్పనిసరిగా ముర్రుపాలు పట్టించాలని సూచించారు. శస్త్రచికిత్స అనంతరం తల్లి బిడ్డకు నేరుగా పాలివ్వలేని పరిస్థితుల్లో పాలను పిండి కప్పులో నిల్వ చేసి సహాయకుల ద్వారా శిశువుకు అందించాలని అవగాహన కల్పించారు.కార్యక్రమంలో సెక్టార్ సూపర్‌వైజర్ కే. కుమారి, అంగన్‌వాడీ కార్యకర్తలు ఉబ్బ లింగం, లోవలక్ష్మి, అరుణకుమారి, సత్యదుర్గ, రమణమ్మతో పాటు గ్రామానికి చెందిన తల్లిదండ్రులు పాల్గొన్నారు.

03
ఇప్పుడు పెన్ పవర్ దిన పత్రికలో
కోర్టు పబ్లికేషన్ యాడ్స్
కేవలం
యాడ్ 500/-
'పో. 12 సెం.మీ, వె. 8 సెం.మీ'
'మరిన్ని వివరాలకు సంప్రదించండి '
93948 55244
షరతులు వర్తిస్తాయి

## రహదారుల అభివృద్ధే కూటమి ప్రభుత్వ లక్ష్యం

- రూ.1.83 కోట్లతో బీటీ రోడ్ల నిర్మాణాలకు ఎమ్మెల్యే మిరియాల శిరీషాదేవి శంకుస్థాపన
- దశాబ్దాల రవాణా సమస్యలకు శాశ్వత పరిష్కారం దిశగా అడుగులు -- నాణ్యతపై రాజీ ఉండదని స్పష్టం



**గంగవరం, పెన్ పవర్, ఆగస్టు 3:**
గ్రామీణ ప్రాంతాల్లో రహదారుల అభివృద్ధికి అత్యంత ప్రాధాన్యత ఇస్తూ, ప్రతి గ్రామానికి మెరుగైన రవాణా సౌకర్యాలు కల్పించడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర ఎస్టీ సంక్షేమ కమిటీ చైర్‌పర్సన్, రంపచోడవరం ఎమ్మెల్యే మిరియాల శిరీషాదేవి పేర్కొన్నారు. సోమవారం గంగవరం, వై.రామవరం మండలాల్లో రూ.183.51 లక్షల వ్యయంతో చేపట్టనున్న బీటీ రోడ్ల నిర్మాణ పనులకు ఆమె శంకుస్థాపన చేశారు.ఈ సందర్భంగా ఆమెకు తెలుగుదేశం పార్టీ మండల అధ్యక్షులు పొత్తూరి కాంతారెడ్డి, పల్లాల వెంకటరెడ్డిల ఆధ్వర్యంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు ఘన స్వాగతం పలికారు.ఎమ్మెల్యే మాట్లాడుతూ, వై.రామవరం మండలం గండేపల్లి--సింహాద్రిపాలెం గ్రామాల మధ్య రూ.49.01 లక్షలు, అలాగే గంగవరం మండలం మోహనపురం ఆర్అండ్‌బీ రోడ్డు నుంచి శరభవరం వరకు రూ.134.50 లక్షలతో బీటీ రోడ్డు నిర్మాణానికి పీఎం--జన్మన్ నిధులు మంజూరైనట్లు తెలిపారు. ఈ రెండు పనుల ద్వారా మొత్తం రూ.183.51 లక్షల అభివృద్ధి పనులు ప్రారంభమయ్యాయని చెప్పారు.గత ప్రభుత్వ నిర్లక్ష్యంతో శిథిలావస్థకు చేరుకున్న గ్రామీణ రహదారులను ఆధునిక రహదారులుగా తీర్చిదిద్దేందుకు కూటమి ప్రభుత్వం ప్రత్యేక కార్యాచరణతో ముందుకు సాగుతోందని ఆమె పేర్కొన్నారు. గ్రామాలకు వెళ్లే మట్టి రహదారులను బీటీ రోడ్లుగా, అంతర్గత రహదారులను సిమెంట్ రోడ్లుగా అభివృద్ధి చేస్తున్నామని తెలిపారు. దీంతో గ్రామీణ ప్రజలు, రైతులు, విద్యార్థులు, అత్యవసర సేవలకు రవాణా సౌకర్యాలు మరింత మెరుగుపడతాయని చెప్పారు.పీఎం--జన్మన్ పథకం కింద చేపట్టే పనులను నాణ్యతా ప్రమాణాలకు అనుగుణంగా పూర్తి చేయాలని కాంట్రాక్టర్లు, ఇంజినీరింగ్ అధికారులు, సంబంధిత శాఖలను ఎమ్మెల్యే ఆదేశించారు. పనుల్లో ఎలాంటి నాణ్యతా లోపాలు, జాప్యాలు చోటుచేసుకోకుండా క్షేత్రస్థాయిలో నిరంతరం పర్యవేక్షణ ఉంటుందని స్పష్టం చేశారు. అభివృద్ధి పనులు ప్రజలకు దీర్ఘకాలిక ప్రయోజనం చేకూరేలా ఉండాలన్నారు.
శంకుస్థాపన కార్యక్రమంలో గ్రామస్తుల నుంచి పలు సమస్యలపై వినతులు స్వీకరించిన ఎమ్మెల్యే, సంబంధిత అధికారులతో ఫోన్‌లో మాట్లాడి తక్షణ చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రజా సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం బాధ్యతాయుతంగా వ్యవహరిస్తుందని ఆమె హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు పల్లాల వెంకటరెడ్డి, వై.రామవరం మండల పార్టీ అధ్యక్షులు పొత్తూరి కాంతారెడ్డి, బీజేపీ జిల్లా అధ్యక్షులు ఈకా బుల్లికొండలు దొర, టిడిపి ప్రధాన కార్యదర్శి కనిగిరి సుభాష్, కుంజం చిన్నాలు దొర, తెలుగుదేశం నాయకులు మాజీ ఎంపీపీ గొర్లె శ్రీకాంత్, మాజీ జడ్పీటీసీ పల్లాల వెంకటరమణ రెడ్డి, మద్దేటి వెంకటరెడ్డి ,జనసేన మండల పార్టీ అధ్యక్షుడు కుంజం సిద్దు, రావడి పుష్పరాజ్, టీఎన్ఎస్ఎఫ్ నియోజకవర్గ అధ్యక్షుడు ముచ్చకర్ల శివ, కింటుకూరి రాంబాబు, మద్దికొండ ప్రసాద్, జి. చిన్నారావు, బొగ్గుల రెడ్డి, పి. ఆదినారాయణ, బూత్ ఇన్‌చార్జి బొగ్గుల సత్తిబాబు, వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు, కూటమి పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## పోలవరం జిల్లాలో నేడు ఎస్టీ సంక్షేమ కమిటీ పర్యటన



- గిరిజన సంక్షేమ పథకాల అమలుపై క్షేత్రస్థాయిలో పరిశీలన
- అభివృద్ధి కార్యక్రమాలపై సమగ్ర నివేదిక సిద్ధం చేయనున్న కమిటీ

**గంగవరం/ రంపచోడవరం, పెన్ పవర్, ఆగస్టు 3:**ఆంధ్రప్రదేశ్ శాసనసభ ఆధ్వర్యంలో ఏర్పాటైన షెడ్యూల్డ్ ట్రైబ్స్ సంక్షేమ కమిటీ (2025--26) సభ్యులు ఆగస్టు 4న పోలవరం జిల్లాలో విస్తృతంగా పర్యటించనున్నట్లు ఐటీడీఏ అసిస్టెంట్ ప్రాజెక్టు అధికారి నాగ వెంకట రమణ సోమవారం విడుదల చేసిన ప్రకటనలో తెలిపారు.కమిటీ చైర్‌పర్సన్, రాష్ట్ర ఎస్టీ సంక్షేమ కమిటీ చైర్‌పర్సన్, ఎమ్మెల్యే మిర్యాల శిరీషాదేవి నేతృత్వంలో కమిటీ సభ్యులు జిల్లాలో గిరిజన ప్రాంతాలను సందర్శించి ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలు తీరును క్షేత్రస్థాయిలో పరిశీలించనున్నారు. ముఖ్యంగా గిరిజనులకు అందుతున్న విద్య, వైద్య సేవలు, తాగునీటి సౌకర్యాలు, రహదారుల అభివృద్ధి, సంక్షేమ వసతి గృహాల నిర్వహణతో పాటు వివిధ అభివృద్ధి కార్యక్రమాల పురోగతిని సమీక్షించనున్నారు.
ఈ కమిటీలో శాసన సభ్యులు కే. ఆదిమూలం, చిర్రి బాలరాజు, జయకృష్ణ నిమ్మక, జి. జయసూర్య, బడేటి రాధాకృష్ణయ్య, మత్స్యరాస విశ్వేశ్వరరాజు, కె. మురళీమోహన్, రేగం మత్స్యలింగం, శాసన మండలి సభ్యులు అనంత సత్య ఉదయ భాస్కర్, డాక్టర్ కుంభా రవిబాబు, పెరబత్తుల రాజశేఖరం సభ్యులుగా ఉన్నారు.పర్యటన సందర్భంగా కమిటీ సభ్యులు స్థానిక ప్రజాప్రతినిధులు, జిల్లా అధికారులు, గిరిజన సంఘాల ప్రతినిధులతో సమావేశమై గిరిజన ప్రాంతాల్లో నెలకొన్న సమస్యలు, ప్రజల అవసరాలు, సంక్షేమ కార్యక్రమాల అమలుపై అభిప్రాయాలు సేకరించనున్నారు. అలాగే సంక్షేమ వసతి గృహాలు, ప్రభుత్వ ఆసుపత్రులు, ఇతర ప్రభుత్వ సంస్థలను సందర్శించి అందుతున్న సేవలను పరిశీలించనున్నారు.
గిరిజన సంక్షేమ పథకాల అమలు, అభివృద్ధి కార్యక్రమాల పురోగతిపై క్షేత్రస్థాయి పరిశీలన అనంతరం సమగ్ర నివేదికను రాష్ట్ర ప్రభుత్వం, ఆంధ్రప్రదేశ్ శాసనసభకు కమిటీ సమర్పించనున్నట్లు అధికారులు తెలిపారు. ఈ పర్యటనతో గిరిజన ప్రాంతాల్లో అమలవుతున్న ప్రభుత్వ కార్యక్రమాలపై సమగ్ర సమీక్ష జరిగే అవకాశం ఉందని పేర్కొన్నారు.

# భూపతిపాలెం ప్రాజెక్టు రంప కెనాల్ ద్వారా వెంటనే సాగునీరు విడుదల చేయాలి






### గిరిజన గ్రామాలకు రోడ్లు, మౌలిక సదుపాయాలు కల్పించాలని ఆదివాసి గిరిజన సంఘం డిమాండ్

### కలెక్టర్ గ్రీవెన్స్ హాల్ ఎదుట ధర్నా -- ర్యాలీ నిర్వహించి వినతిపత్రం సమర్పణ

**గంగవరం /రంపచోడవరం, పెన్ పవర్, ఆగస్టు 3:**భూపతిపాలెం ప్రాజెక్టు రంప కెనాల్ (ఎడమ కాలువ) ద్వారా ఆయకట్టు పరిధిలోని రైతులకు తక్షణమే సాగునీరు విడుదల చేయాలని,
కాలువకు అత్యవసర మరమ్మతులు చేపట్టాలని, గిరిజన గ్రామాలకు రోడ్లు, తాగునీరు, రవాణా తదితర మౌలిక సదుపాయాలు కల్పించాలని ఆదివాసి గిరిజన సంఘం--పోలవరం జిల్లా కమిటీ డిమాండ్ చేసింది. ఈ మేరకు సోమవారం కలెక్టర్ గ్రీవెన్స్ హాల్ ఎదుట రైతులతో కలిసి ధర్నా, ర్యాలీ నిర్వహించి అధికారులకు వినతిపత్రం సమర్పించారు.ఈ సందర్భంగా ఆదివాసి గిరిజన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు లోత రామారావు మాట్లాడుతూ, రంప కెనాల్ ఆయకట్టు పరిధిలోని రంప, కుంజావీధి, గజ్జవెలగలు, బందపల్లి, తాళ్లపాలెం, బూరుగుబంద, మూలపాడు, జడమాట్లపాలెం, నల్లగొండ, కొమరవరం, కుసుమరాయి, గంగవరం, లక్కొండ, గురగుమ్మి, గారాలపాడు గ్రామాలతో పాటు రంప, మర్రివాడ, ఉట్ల, డి.వెలమలకోట, మర్రిపాలెం, గోరగొమ్మి, ఆముదాలబంద గ్రామపంచాయతీల పరిధిలోని రైతులు గత నాలుగేళ్లుగా సాగునీరు లేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే భూపతిపాలెం ప్రాజెక్టు నుంచి రంప కెనాల్ ద్వారా సాగునీరు విడుదల చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. గంగవరం ఎంపీపీ పల్లాల కృష్ణారెడ్డి మాట్లాడుతూ, భూపతిపాలెం ప్రాజెక్టు ద్వారా సాగునీరు అందాల్సిన వేలాది ఎకరాలకు నీరు సక్రమంగా అందకపోవడంతో రెండు పంటలు పండే సారవంతమైన భూములు బీడుభూములుగా మారుతున్నాయని అన్నారు. రైతులు అప్పులపాలై తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. వర్షాభావ పరిస్థితులతో చెరువులు, కుంటలు ఎండిపోవడంతో నారుమడులు సిద్ధం చేసిన రైతులు వరి నాట్లు వేయలేని పరిస్థితి నెలకొందన్నారు. ఎడమ కాలువలో పూడిక పేరుకుపోవడం, లీకేజీలు, మరమ్మతుల లేమి కారణంగా చివరి ఆయకట్టు వరకు నీరు చేరడం లేదని ఆరోపించారు.గిరిజన గ్రామాలకు ఇప్పటికీ సరైన రహదారులు, తాగునీరు, రవాణా, విద్య, వైద్య సదుపాయాలు లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, ప్రభుత్వం వెంటనే స్పందించి మౌలిక వసతులు కల్పించాలని ఆయన డిమాండ్ చేశారు.జిల్లా అధ్యక్షుడు ఈతపల్లి సిరిమల్లె రెడ్డి మాట్లాడుతూ, స్వాతంత్ర్యం వచ్చి 78 సంవత్సరాలు పూర్తవుతున్నా అనేక గిరిజన గ్రామాల్లో ఇప్పటికీ మట్టి రోడ్లే ఉండటం దురదృష్టకరమన్నారు. గిరిజనుల అభివృద్ధి గురించి ప్రభుత్వాలు మాటలు చెబుతున్నప్పటికీ, క్షేత్రస్థాయిలో అభివృద్ధి కనిపించడం లేదని విమర్శించారు. రంపచోడవరం మండలం వేములకొండ పంచాయతీ పరిధిలోని చెలకవీధి, రాకోట, సుపరపాలెం, గంగవరం మండలంలోని పిండికొండవీధి, కొమరవరం, మర్రిపాలెం, కుసుమరాయి గ్రామాలకు తక్షణమే రోడ్లు నిర్మించాలని కోరుతూ ఆయా గ్రామాల ప్రజల తరఫున వినతిపత్రాలు సమర్పించినట్లు తెలిపారు.డిమాండ్లపై ప్రభుత్వం తక్షణ చర్యలు తీసుకుని రైతులకు సాగునీరు విడుదల చేయాలని, లేకపోతే ఆయకట్టు గ్రామాల రైతులతో కలిసి మరింత విస్తృత స్థాయిలో ప్రజాస్వామ్యబద్ధమైన ఆందోళనలు చేపడతామని నాయకులు హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో ఆదివాసి గిరిజన సంఘం జిల్లా నాయకులు సాదల విద్యాధర్ రెడ్డి, తీగల శ్రీనివాస్, కంభం శాంతిరాజు, గ్రామ పెద్దలు పీరు అబ్బాయి రెడ్డి, రోలిపల్లి శ్రీనివాస్ రెడ్డి, తాము బాపన్న దొర, పల్లాల గణేష్ రెడ్డితో పాటు వివిధ గ్రామాల రైతులు, గిరిజనులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# పునరావాస కేంద్రంలో ఏర్పాట్లను పరిశీలించిన కమిషనర్ రాహుల్ మీనా





**రాజమహేంద్రవరం, పెన్ పవర్, ఆగస్టు 3** గోదావరి వరదల నేపథ్యంలో ఆల్కట్ గార్డెన్ లో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రాన్ని సోమవారం కమిషనర్ రాహుల్ మీనా పరిశీలించారు. పునరావాస కేంద్రంలో ఎన్ని కుటుంబాలు ఎక్కడి నుంచి తరలించారనే సమా చారాన్ని అధికారులను అడిగి తెలుసుకున్నారు. ప్రస్తుతం 260 మంది పునరావాస కేంద్రంలో ఉన్నట్లు అధికారులు కమిషనర్ కు తెలిపారు. ఈ సందర్భంగా బాధితులను పరామర్శించి సదు పాయాలపై ఆరా తీశారు. ఎవరికి అసౌక ర్యం కలగకుండా చూడాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. మెడికల్ క్యాంపును పరిశీలించి ఎవరికి అనారోగ్య సమస్యలు తలెత్తకుండా వైద్యాధికారులు అందుబాటులో ఉండాలని సూచించారు. అనంతరం కోటిలింగాల ఘాట్, పుష్కర్ ఘాట్, రివర్ ఫ్రంట్ సహా క్షేత్రస్థాయిలో పర్యటించి వరద పరిస్థితులను ప్రత్యక్షంగాపరిశీలించారు. వరద తగ్గుముఖం పట్టినప్పటికి అధికారు లు, సిబ్బంది అప్రమ త్తంగా ఉండి పరిస్థితు లను నిరంతరం పర్యవేక్షిస్తూ ప్రజలకు సహాయ సహకారాలు అందించాలని ఆదేశించారు. ప్రజలు వరద నీటిలోకి వెళ్లకుండా, ప్రమాదకర ప్రాంతాలకు చేరకుండా తగిన చర్యలు చేపట్టాలని సూచిం చారు. ఆయన వెంట ఎస్ఈ రీటా, ఈఈలు మదర్షా అలీ, మాధవి, ఎంహెచ్ఓ వినూత్న, డీఈలు, సిబ్బంది ఉన్నారు.

## ఇంటి స్థలం ఆక్రమించిన వారిపై చర్యలు తీసుకోవాలి

✸ కర్నాకుల వీరాంజనేయులు డిమాండ్



**జగ్గంపేట, పెన్ పవర్, ఆగస్టు 3:** జగ్గంపేట మండలం నరేంద్రపట్నం గ్రామ పరిధిలోని బావారంలో పల్లా సూరిబాబుకు చెందిన ఇంటి స్థలాన్ని అధికార పార్టీ నాయకుల అండదండలతో అక్రమంగా ఆక్రమించిన వారిపై చర్యలు తీసుకోవాలని, అధికారుల, పోలీసుల నిర్లక్ష్య వైఖరిని నిరసిస్తూ ఆంధ్రప్రదేశ్ రైతు కూలీ సంఘం ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా కమిటీ ఆధ్వర్యంలో జగ్గంపేట తహసిల్దార్ కార్యాలయం వద్ద సోమవారం ధర్నా నిర్వహించారు. అనంతరం తహసిల్దార్ కి వినతి పత్రం అందజేశారు. ఏపీఆర్సిఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కర్నాకుల వీరాంజనేయులు మాట్లాడుతూ మండలంలోని భావారం గ్రామానికి చెందిన పళ్ళ సూరిబాబు ఇంటి స్థలాన్ని పల్లా కృష్ణ అనే వ్యక్తి దౌర్జన్యంగా అక్రమంగా ఆక్రమించుకున్నడన్నారు. మా భూమి లోకి ఎందుకు వచ్చావని సూరిబాబు ప్రశ్నిస్తే సూరిబాబు వారి కుటుంబం పై దౌర్జన్యానికి దిగుతున్నాడన్నారు. అధికార పార్టీ అండదండలతో పోలీసులను అధికారులను మేనేజ్ చేస్తున్నారని వారు ఆరోపించారు. బాధితుడు అనేకసార్లు పోలీసులు, అధికారుల చుట్టూ తిరిగిన పరిష్కారం కాలేదన్నారు. కంచే చేను మేసిన చందంగా రక్షించవలసిన పోలీసులే ఆక్రమదారుడు కి కొమ్ము కాస్తూ బాధితులను బెదిరిస్తున్నారన్నారు. తక్షణమే మండల తహసిల్దార్ జోక్యం చేసుకొని విచారణ చేపట్టి ఆక్రమణ దారులపై చట్టపరమైన చర్యలు తీసుకొని ఆక్రమణలను తొలగించి, బాధితులకి రక్షణ కల్పించి, న్యాయం చేయాలని డిమాండ్ చేశారు లేని పక్షంలో రైతు కూలీ సంఘం ఆధ్వర్యంలో ఉద్యమం చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఏపీ ఆర్ సి ఎస్ ఉమ్మడి జిల్లా అధ్యక్షులు వల్లూరి రాజబాబు, పిడిఎస్యు (విజృంభణ) రాష్ట్ర కార్యదర్శి కడితి సతీష్, ప్రగతిశీల మహిళా సంఘం (స్త్రీ విముక్తి )జిల్లా నాయకులు రెడ్డి దుర్గాదేవి, ఏపీ ఆర్ సి ఎస్ జిల్లా నాయకులు కె. రామలింగేశ్వర రావు, జాను, బాధితులు పల్లా సూరిబాబు, పల్లా లక్ష్మి, మరియు బాధితులకు మద్దతుగా కుటుంబ సభ్యులు, గ్రామ పెద్దలు, గ్రామస్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## తగ్గింపు ధరలతో బియ్యం విక్రయ కేంద్రాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే నెహ్రూ



**జగ్గంపేట, పెన్ పవర్, ఆగస్టు3:** ప్రజల మేలు కోసమే కూటమి ప్రభుత్వం అనునిత్యం కృషి చేస్తోందని జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ అన్నారు. సోమవారం ప్రముఖ పారిశ్రామికవేత్త, బాలాజీ గ్రూప్ ఆఫ్ ఇండస్ట్రీస్ అధినేత కొత్త బైరవకృష్ణ ఆధ్వర్యంలో శ్రీబాలాజీ బాయిల్డ్ అండ్ రా రైస్ మిల్ ఏర్పాటుచేసిన సన్న బియ్యం అమ్మకం కేంద్రాన్ని టీటీడీ బోర్డు సభ్యులు, టిడిపి పొలిట్ బ్యూరో సభ్యులు జ్యోతుల నెహ్రూ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ మాట్లాడుతూ రాష్ట్ర పౌరసరఫరాల శాఖ ఆధ్వర్యంలో రాష్ట్ర రైస్ మిల్లర్ల సంఘం సహకారంతో ఒకేసారి 150 రైతు బజార్లు, 500 రైస్ మిల్లర్ల ప్రత్యేక కౌంటర్లలో బియ్యాన్ని తక్కువ ధరకే విక్రయించే కార్యక్రమం ప్రభుత్వం చేపట్టిందన్నారు. ప్రస్తుతం మార్కెట్‌లో బీపీటీ సూపర్ ఫైన్ బియ్యం కిలో రూ.65కు విక్రయిస్తుండగా ప్రభుత్వ విక్రయ కేంద్రాల్లో అదే బియ్యాన్ని రూ.52కే అందిస్తారని, బీపీటీ రా బియ్యాన్ని అంటే పచ్చిబియ్యాన్ని రూ.58 నుంచి ఎనిమిది రూపాయలు తగ్గించి 50 రూపాయలకే విక్రయిస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో జగ్గంపేట తహసిల్దార్ జి వి ఆర్ రమేష్, ఎస్వీఎస్ అప్పలరాజు, జీను మణిబాబు, కొత్త కొండబాబు, పాంద్రంగి రాంబాబు, కొత్త హరికిషన్, కొత్త నిఖిల్, ఆర్ ఐ మంగపతి నాయుడు, జగ్గంపేట పంచాయతీ అభివృద్ధి అధికారి శివ తదితరులు పాల్గొన్నారు.

## ప్రత్తిపాడులో భారతీయ కిసాన్ సంఘ్ జిల్లా కమిటీ సమావేశం.



**కిర్లంపూడి/ప్రత్తిపాడు, పెన్ పవర్ ఆగస్టు, 03:**మండల కేంద్రమైన ప్రత్తిపాడు మునసుబుగారి రామాలయంలో సోమవారం భారతీయ కిసాన్ సంఘ్ జిల్లా కమిటీ సమావేశం నిర్వహించారు.

జిల్లా అధ్యక్షుడు రాసంశెట్టి రాజా అధ్యక్షత వహించిన ఈ సమావేశంలో జిల్లా ఉపాధ్యక్షుడు నీలగిరి చిట్టిబాబు,కోశాధికారి కంపరపు నాగేశ్వరరావు,బి జె పి కిసాన్ మోర్చ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు సింగిలిదేవి సత్తిరాజు పాల్గొని రైతులు సమస్యలు పై చర్చించారు.ఈ సమావేశంలో పలు తీర్మానాలు తీర్మానించి ఏకగ్రీవంగా ఆమోదించారు.

ప్రత్తిపాడు మండలంలో రైతుల పంట కాలువలు ఉపాధి కూలీలతో శభ్రం చేయించాలని

.ప్రధాన మంత్రి పసల్ బీమా (క్రాప్ ఇన్సూరెన్స్) ప్రీమియం ప్రభుత్వమే చెల్లించాలని,ఎల్ నినో ప్రభాన్ని దృష్టిలో పెట్టుకుని జిల్లాలో సాగునీటి ప్రాజెక్టుల నుండి సరిపడా నీరును అందించాలన్నారు.

ఈ సమావేశంలో జిల్లా కార్యవర్గ సభ్యులు పెదిరెడ్ల గంగారావు,మదినే బాబ్జి,వెంకటరమణ,భేరి రాము తదితరులు పాల్గొన్నారు.

సమావేశ అనంతరం ప్రత్తిపాడు ఎ పి ఒ గారికి వినతిపత్రం ఇచ్చి పంటకాలువలు శు భ్రం చేయించాలని కోరారు.

## ప్రజల జీవన ప్రమాణాల మెరుగుదలే కూటమి ప్రభుత్వ లక్ష్యం





### లొల్ల, వాడపల్లిలో ఇంటింటి ప్రచారంలో ఎమ్మెల్యే బండారు..

**ఆత్రేయపురం పెన్ పవర్. ఆగస్టు 3:**ప్రజలకు సుపరిపాలన అందించడం, సంక్షేమ ఫలాలను ప్రతి ఇంటికి చేరవేయడం, అభివృద్ధి కార్యక్రమాలను వేగవంతం చేయడం ప్రధాని నరేంద్ర మోదీ, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ నాయకత్వంలోని కూటమి ప్రభుత్వంతోనే సాధ్యమైందని కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు అన్నారు. రెండేళ్ల కూటమి ప్రభుత్వ పాలనలో సాధించిన అభివృద్ధి, అమలు చేసిన సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు వివరించే ఉద్దేశంతో సోమవారం లొల్ల, వాడపల్లి గ్రామాల్లో నిర్వహించిన'నమ్మకం--అభివృద్ధి--సంక్షేమం' కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు.ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ పథకాలపై రూపొందించిన కరపత్రాలను పంపిణీ చేసిన ఎమ్మెల్యే ప్రజలతో నేరుగా మమేకమయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలకు ప్రజల నుంచి విశేష ఆదరణ లభిస్తోందన్నారు. ఇంటింటికీ వెళ్లిన ప్రతిచోట ప్రజలు సాదరంగా స్వాగతం పలుకుతూ ప్రభుత్వ పాలనపై సంతృప్తి వ్యక్తం చేస్తున్నారని తెలిపారు.సామాజిక భద్రతా పింఛన్ల పెంపు, మహిళలకు ఉచిత గ్యాస్ సిలిండర్ల పంపిణీ, ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణ సౌకర్యం వంటి పథకాలు ప్రజలకు ప్రత్యక్షంగా ప్రయోజనం చేకూరుస్తున్నాయని పేర్కొన్నారు. 'తల్లికి వందనం' పథకం ద్వారా విద్యార్థుల తల్లిదండ్రులకు ఆర్థిక భరోసా కల్పించడంతో పాటు, 'అన్నదాత సుఖీభవ' కింద రైతులకు ఏటా రూ.20 వేల పెట్టుబడి సాయం అందిస్తున్నామని వివరించారు. సంక్షేమంతో పాటు అభివృద్ధిని సమన్వయం చేస్తూ ప్రజల జీవన ప్రమాణాలను మెరుగుపర్చడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని స్పష్టం చేశారు.గత ప్రభుత్వ హయాంలో శాంతిభద్రతలు దెబ్బతిన్నాయని విమర్శించిన ఎమ్మెల్యే, ప్రస్తుతం రాష్ట్రంలో చట్టవ్యవస్థను బలోపేతం చేసి ప్రశాంత వాతావరణం నెలకొల్పేందుకు ప్రభుత్వం కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటోందన్నారు.అనంతరం వాడపల్లి శ్రీ వెంకటేశ్వరస్వామి ఆలయ పరిసరాలను ఎమ్మెల్యే పరిశీలించారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఆలయ పరిసరాలను ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచాలని ఆలయ డిప్యూటీ కమిషనర్ నల్లం సూర్యచక్రధర్‌రావు, ఎంపీడీవో, పంచాయతీ అధికారులను ఆదేశించారు. స్వచ్ఛమైన, పరిశుభ్రమైన వాడపల్లిని తీర్చిదిద్దేందుకు అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. కార్యక్రమంలో వాడపల్లి దేవస్థానం చైర్మన్ ముదునూరి వెంకటరాజు, నీటి ప్రాజెక్ట్ ఉపాధ్యక్షులు కరుటూరు నరసింహారావు, కాయలు జగన్నాథం, పేర్చర్ల పుల్లంరాజు వర్మ ,వెచ్చ అనిల్, తదితరులు గ్రామ నాయకులు టిడిపి నాయకులు పాల్గొన్నారు

## బియ్యం ధరల నియంత్రణకు ప్రభుత్వం చర్యలు

కొత్తపేట, రావులపాలెం రైతు బజార్లలో విక్రయ కేంద్రాల ప్రారంభం.. ఎమ్మెల్యే బండారు








**రావులపాలెం పెన్ పవర్ ఆగస్టు 3:** పెరిగిన బియ్యం ధరలతో సామాన్య ప్రజలు ఇబ్బందులు పడకుండా కూటమి ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టిందని కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు తెలిపారు. రాష్ట్ర పౌరసరఫరాల శాఖ ఆధ్వర్యంలో, రాష్ట్ర రైస్ మిల్లర్ల సంఘం సహకారంతో రైతు బజార్లు, ఎమ్మార్వో కార్యాలయాల్లో ఏర్పాటు చేసిన బియ్యం విక్రయ కేంద్రాలను సోమవారం కొత్తపేట, రావులపాలెం రైతు బజార్లలో ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో ఏపీ బీసీ స్టేట్ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్‌పర్సన్ రెడ్డి అనంతకుమారి, ఆర్డీవో జి.వి.వి. సత్యనారాయణ, కొత్తపేట రైస్ మిల్లర్ల సంఘం అధ్యక్షుడు వంటిపల్లి పాపారావు, మార్కెట్ యార్డ్ చైర్మన్ పల్లి మంగాదేవి భీమరావు పాల్గొన్నారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా ఒకేసారి 150 రైతు బజార్లు, 500 రైస్ మిల్లర్ల ప్రత్యేక కౌంటర్ల ద్వారా నాణ్యమైన బియ్యాన్ని మార్కెట్ ధర కంటే తక్కువకు విక్రయించే కార్యక్రమాన్ని ప్రభుత్వం ప్రారంభించిందన్నారు. ప్రస్తుతం మార్కెట్‌లో కిలో రూ.62కు విక్రయిస్తున్న బీపీటీ సూపర్ ఫైన్ బియ్యాన్ని ప్రభుత్వ విక్రయ కేంద్రాల్లో రూ.52కే, రూ.58 ఉన్న బీపీటీ రా (పచ్చి) బియ్యాన్ని రూ.50కే అందిస్తున్నామని వివరించారు. నిత్యావసర వస్తువుల ధరలు పెరిగినప్పుడు సామాన్య ప్రజలపై భారం పడకుండా ధరల స్థిరీకరణ నిధి ద్వారా ప్రభుత్వం జోక్యం చేసుకుని ధరలను నియంత్రించే చర్యలు తీసుకుంటోందన్నారు. నాణ్యమైన బియ్యం అందుబాటు ధరలో ప్రజలకు అందించాలనే ఉద్దేశంతో రైతు బజార్లు, ఎమ్మార్వో కార్యాలయాల్లో ఈ కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

త్వరలో రాష్ట్రవ్యాప్తంగా 'మీ మార్ట్' కేంద్రాలను ఏర్పాటు చేసి నిత్యావసర వస్తువులను మార్కెట్ ధర కంటే తక్కువకు అందుబాటులోకి తీసుకురానున్నట్లు ఎమ్మెల్యే వెల్లడించారు. రైతు బజార్ల భావనను ప్రవేశపెట్టింది చంద్రబాబు నాయుడేనని గుర్తు చేసిన ఆయన, రైతులకు గిట్టుబాటు ధర, వినియోగదారులకు అందుబాటు ధర కల్పించడంలో రైతు బజార్లు కీలక పాత్ర పోషిస్తున్నాయని పేర్కొన్నారు.

జిల్లాలో ఉన్న మూడు రైతు బజార్లలో రెండూ కొత్తపేట నియోజకవర్గంలోనే ఉండటం సంతోషకరమని, డిమాండ్--సరఫరా సూత్రానికి అనుగుణంగా ధరలను నియంత్రిస్తూ రైతు బజార్లను సమర్థవంతంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. రావులపాలెం మార్కెట్ యార్డ్ ప్రాంగణంలో శాశ్వత రైతు బజార్ నిర్మాణానికి కృషి చేస్తున్నామని ఎమ్మెల్యే బండారు సత్యానందరావు వెల్లడించారు.